

శైవక్షేత్రాల వైశిష్ట్యం

● భక్తుల కొంగు బంగారంగా కాకతీయుల కాలం గొప్ప ఆలయాలు
● మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన శైవ క్షేత్రాలు



జిల్లాలోని శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబు చేశారు. బీబీనగర్, యాదగిరిగుట్టలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఒక్కోచోట ఒక్కో పేరుతో ఆ శివుడిని పూజిస్తున్నారు. ఒక చోట రామలింగేశ్వరుడిగా, మరోచోట పచ్చల సోమేశ్వరుడిగా, మరోచోట శివుడిగా.. ఇలా ఆ పరమ శివుడికి పూజలు చేస్తున్నారు. ఆ ఆలయాల విశేషాలు

6వ పేజీలో..

నేత్రపర్వంగా ధ్వజారోహణం

యాదగిరిగుట్టలో వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు



దేవతాహ్వానం పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

7

పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలి

డీపీవో వెంకయ్య

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని డీపీవో వెంకయ్య అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రజలనుంచి ఇంటి పన్నులు వసూలు చేయాలని, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా నర్సరీల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలని, వేసవిలో ఎండకారణంగా చెట్లు ఎండిపోతే కొత్త మొక్కలు నాటి ఎదిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంగీత, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

హాలియా, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులు కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డులో కంది కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన కందులను మార్కెట్‌కు తీసుకొచ్చి మద్దతు ధర క్వింటాకు రూ.7,550 పొందాలన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఎఫ్ఏక్యూ నిబంధనలు అనుసరంగా కందిని తీసుకొని వచ్చి కొనుగోలు కేంద్రానికి సహకిరంచాలని కోరారు. కార్యక్రమంలో పాక్స్ సీఈవో సత్యం, జానకిరాములు, వ్యవసాయాధికారులు, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో గడువు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో చివరిదశలో ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులు ఎవరికి వారు గెలుపు ధీమాతో ప్రచారంలో దూసుకెళుతుంటే, ఉపాధ్యాయ సంఘాలు తాము మద్దతిచ్చిన అభ్యర్థుల విజయంకోసం శ్రమిస్తున్నాయి.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- టీచర్లతో వ్యక్తిగతంగా అనుసంధానానికి ప్రాధాన్యమిచ్చిన అభ్యర్థులు
- సోషల్‌మీడియాలో విస్తృతస్థాయి ప్రచారం
- తటస్థ, సైలెంట్ ఓటర్లపైనే ఎక్కువ దృష్టి
- నేటి సాయంత్రం నుంచి ఎన్నిక పూర్తయ్యే వరకూ సైలెన్స్ పీరియడ్ : కలెక్టర్





నేటితో ప్రచారానికి తెర

సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఎన్నికలప్రచారం సాగుతోంది. గెలుపే లక్ష్యంగా ప్రధాన అభ్యర్థులు దూకుడు పెంచారు. చివరిదశలో ఉపాధ్యాయ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరంచేశారు. బుధవారం సాయంత్రం నుంచి ఎస్ఎంఎస్‌లు సైతం పెట్టకుండా ఎన్నికల సంఘం నిషేధం విధించడంతో ఈలోపే ప్రతి ఉపాధ్యాయుడికీ తమ అభ్యర్థన వెళ్లేలా బరిలో నిలిచిన అభ్యర్థులు ఏర్పాట్లుచేసుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి టీఎస్ యూటీఎఫ్ నుంచి బరిలో ఉండగా, పీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్టీయూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ-టీఎస్ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ నుంచి పులి సరోత్తమ్‌రెడ్డి, బీసీ సంఘాల మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సుందర్‌రాజ్ యాదవ్ సహా మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ స్థానంలో గెలవడం ద్వారా ఉపాధ్యాయ వర్గాల్లో తమ ఆధిక్యతను చాటేందుకు ఉధృతంగా ప్రచారం సాగించారు.

ప్రతి ఉపాధ్యాయుడికీ సందేశం చేరడమే లక్ష్యం

ఈ నియోజకవర్గంలో భిన్న తరహాలో ప్రచారం కొనసాగింది. ఉపాధ్యాయుల సమ్మేళనాలు, సమావేశాలతోపాటు అభ్యర్థులు నేరుగా ఓటర్లతో అనుసంధానమవుతూ తమకు ఓట్లేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఉపాధ్యాయ సంఘాల ద్వారా, సమావేశాల ద్వారా ఓట్లను అభ్యర్థిస్తూనే మరోవైపు సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులతో టెలీ కాన్ఫరెన్సులు, గ్రూప్ కాల్స్ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఉపాధ్యాయ నేతగా ఇప్పటివరకు తాము చేసిన పోరాటాలు, కృషిని గుర్తుచేయడంతోపాటు, ప్రస్తుతం నెలకొన్న ఉపాధ్యాయ సమస్యలు, సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగంలో వచ్చిన మార్పులు, వ్యవస్థ బలోపేతానికి తాము చేపట్టబోయే కార్యాచరణను వివరించారు. సంఘాలు ఏవైనా ఆయా ఉపాధ్యాయులతో తమకున్న సంబంధాలను గుర్తుచేస్తూ సెంటిమెంట్‌ని సైతం పండించారు. తమవాదాన్ని, సిద్ధాంతాన్ని తెలియజేస్తూ తమకే ఓటేయాలంటూ అభ్యర్థించారు. ప్రధాన అభ్యర్థులంతా ఈ తరహాలో ప్రతీ ఉపాధ్యాయ ఓటరుకి తమ గళం వినిపించేలా, కనీసం ఒక్కసారైనా వారిని నేరుగా ఓటు అభ్యర్థించేలా ఈసారి ప్రచారవ్యూహం అమలు చేశారు.



సోషల్ మీడియాలో హోరెత్తిన ప్రచారం

నియోజకవర్గం పరిధి విస్తృతంగా ఉండడంతో అభ్యర్థులంతా సోషల్ మీడియాను ప్రచారంలో విస్తృతంగా వినియోగించుకున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌వేదికలుగా ఉధృతస్థాయిలో తమగళం వినిపించారు. తమకు ఓటేస్తే...

- మిగతా 7వ పేజీలో...

48 గంటలపాటు సైలెన్స్ పీరియడ్ : కలెక్టర్



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగనున్న నేపథ్యంలో 48గంటల సైలెన్స్ పీరియడ్ అమల్లో ఉంటుందని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు బహిరంగసభలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రచారాలు, రాజకీయపరమైన, అభ్యంతరకరమైన కంటెంట్‌తో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం కొనసాగుతుందన్నారు. సోషల్‌మీడియాపైనా నిశితమైన పరిశీలన కొనసాగుతుందని, సైలెన్స్ పీరియడ్‌లో నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే ఎన్నికల ప్రవర్తనానియామావళి ననుసరించి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సైలెన్స్ పీరియడ్‌లో జిల్లాయేతర వ్యక్తులేవరు జిల్లాలో ఉండవద్దని హెచ్చరించారు. అదేవిధంగా సైలెన్స్ పీరియడ్‌లో నియోజకవర్గమంతా, ఓట్లలెక్కింపు నిర్వహించే మార్చి 3వ తేదీన లెక్కింపు పూర్తయ్యేంతవరకు నల్లగొండ మున్సిపల్ పరిధిలో మద్యనిషేధం కూడా అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేంతవరకు జిల్లాలో 144వ సెక్షన్ సైతం అమల్లో ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు.

జిల్లా	పోలింగ్‌స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	మొత్తం
నల్లగొండ	37	2817	1866	4683
సూర్యాపేట	23	1702	962	2664
యాదాద్రి	17	638	346	984
సిద్దిపేట	4	123	43	166
జనగాం	12	614	388	1002
హనుమకొండ	15	2943	2272	5215
వరంగల్	13	1474	878	2352
మహబూబాబాద్	16	1112	551	1663
జె.భూపాలపల్లి	7	215	114	329
ములుగు	9	405	223	628
భద్రాద్రి	23	1068	954	2022
ఖమ్మం	24	2372	1717	4089
మొత్తం	200	15483	10314	25797

బాధితులను రక్షించేందుకు కృషి

మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సొరంగమార్గం ఇన్‌లెట్ దోమలపెంట వద్ద సొరంగంలో చిక్కుకున్న ఎనిమిదిమందిని కాపాడేందుకు ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ, నాగార్జున సాగర్, అచ్చంపేట ఎమ్మెల్యేలు బాలునాయక్, జైవీర్‌రెడ్డి, వంశీకృష్ణలతో కలిసి సొరంగమార్గాన్ని సందర్శించి మాట్లాడారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాడేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిక్కుకున్న వారిని కాపాడేందుకు కేంద్ర బలగాలు, సైనికులు, సింగరేణి రెస్క్యూటీం, హైడ్రా సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు సొరంగ మార్గం వద్ద ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



శ్రీశైలం సొరంగమార్గం వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి జానారెడ్డి, చిత్రంలో దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు బాలునాయక్, జైవీర్‌రెడ్డి

పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మహాసభలో మాట్లాడుతున్న జనరల్ సెక్రటరీ పీయూ ఖద్బే

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం ఆర్-3 జనరల్ సెక్రటరీ పీయూ ఖద్బే అన్నారు. సోమవారం నల్లగొండలోని ఎలిమినేటి మాధవరెడ్డి పోలీస్ ఆడిటోరియంలో రిసెప్షన్ కమిటీ చైర్మన్, ఏఐపీఆర్‌పీఏ తెలంగాణ సర్కిల్ అధ్యక్షుడు సీహెచ్‌వీ రామారావు, సెప్షన్ కమిటీ జనరల్ సెక్రటరీ మోహన్ నేనావత్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న తెలంగాణ పోస్టల్ ఉద్యోగుల ద్వైవార్షిక మహాసభ(ఆలిండియా ఆర్ఎంఎస్ అండ్ ఎంఎంఎస్ ఎంప్లాయిస్ యూనియన్ గ్రూప్ సీ అండ్ మెయిల్ గార్డ్స్ అండ్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ గ్రూప్ సీ)కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 8వ పే కమిషన్‌లో లెవల్ 5 కావాలని తీర్మానం చేశారు. ఇంటిగ్రేటెడ్ మెయిల్ యూనియన్ కార్యాలయం గోల్కొండకు తరలిపోకుండా జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు.

అదే విధంగా ఎల్ 2 కార్యాలయాలను మూసివేయవద్దని అన్నారు. మంగళవారం జరిగే ముగింపు సభకు ముఖ్య అతిథిగా ఆర్ 4 మాజీ జనరల్ సెక్రటరీ పి.సురేష్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ ముక్తార్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ సీఎస్ నాయుడు, మాజీ సర్కిల్ సెక్రటరీ ఎం.నాగవర్ధన్‌రావు, జీఆర్ రెడ్డి, సర్కిల్ సెక్రటరీ ఎం.ముతేష్ , సీహెచ్‌వీ. రామారావు, మోహన్ నేనావత్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగే ఇంటర్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ అన్నారు. సోమవారం అయన తన చాంబర్లో ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ విషయమై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వరకు పదో తరగతి పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుండగా, పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30వరకు జరుగుతాయన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రు నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకులంలో అదనపు కలెక్టర్ రాత్రిబస

నిడమనూరు: నిడమనూరు మండలం వేంపాడ్ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులతో కలిసి రాత్రిబస చేశారు. గురుకులాల పర్యవేక్షణలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంది, విద్యా బోధన ఎలా ఉందని విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో కలిసి రాత్రి భోజనం చేసి గురుకులంలోనే నిద్రించారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీవో కేదారినాథ్, ఆర్ఐ దాడి రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, గంగుల లింగయ్య, గురుకులం ప్రిన్సిపాల్ చింతమళ్ల రాంబాబు ఉన్నారు.



గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

రిటైర్‌మెంట్ ప్రయోజనాలు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం



నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) ఉద్యోగులకు రిటైర్‌మెంట్ ప్రయోజనాలు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఉందని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్లగొండలో పర్యటించిన ఆయన జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోర్టును ఆశ్రయించి తమకు రావాల్సిన ప్రయోజనా లను ఉద్యోగులు పొందాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గత సీఎం కేసీఆర్ రూ. 7లక్షల కోట్లు అప్పు చేశారని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి తీసుకువెళ్లారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి, బీజేపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి రాష్ట్ర, జిల్లా నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, శానంపూడి సైదిరెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవి, పిల్లి రామరాజు, విజయారెడ్డి, శ్రీలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చెర్వుగట్టుపై అసలేం జరుగుతోంది ?

ఆర్డీవో ఆకస్మిక తనిఖీతో సిబ్బందిలోనూ చర్చ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అసలేం జరుగుతోందనే చర్చ మొదలైంది. నల్లగొండ ఆర్డీవో రెండు సార్లు ఆకస్మిక తనిఖీ చేయడంతో పాటు మళ్లీ వస్తానని రికార్డులు తనిఖీ చేస్తానని చేసిన ప్రకటనతో ఈ చర్చ మరింత పెరిగింది. దేవస్థానంలో ఇటీవల పూర్తయిన ఉత్సవాల ఏర్పాట్ల నిమిత్తం నిర్వహించిన సన్నాహక సమావేశం రోజునే కొందరు కలెక్టర్‌కు పలు అంశాలపై ఫిర్యాదు చేయగా దాని పర్యవసానమే ఆర్డీవో రికార్డుల తనిఖీ చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో ప్రధానంగా వివిధ టెండర్ల నిర్వహణ... బకాయిల పైనే ప్రధానంగా ఫిర్యాదులు వచ్చేవి. ఇపుడు ప్రతీ విభాగానికి సంబంధించి క్షుణ్ణంగా ఆర్డీవో రికార్డులు పరిశీలించడం వెనుక అసలు మతలబు ఏమిటనేది ప్రశ్నగా మారింది. దేవస్థానంలో నిర్వహించిన కొన్ని టెండర్లు ఒకే వ్యక్తికి రావడంపై కూడా ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. సివిల్ కాంట్రాక్టర్ లైసెన్సు ఉన్న వ్యక్తికి జాతర లైటింగ్ కాంట్రాక్ట్ ఎలా ఇస్తారంటూ టెండరు వేసిన పోటీదారుల్లో అర్హత గల ఓ టెండరు దారుడు ప్రశ్నించి పై అధికారులకు కూడా మౌఖికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

అప్పుడు డీఆర్‌డీఏ పీడీ: గతంలో కలెక్టర్‌గా నారాయణరెడ్డి ఉన్నప్పుడు కూడా ఇదే రకమైన ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో చెర్వుగట్టు క్షేత్రంపై దృష్టి పెట్టిన నారాయణరెడ్డి డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డికి చెర్వుగట్టు పర్యవేక్షణ బాధ్యతలకు సంబంధించి మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆయన ఆలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి దేవస్థాన నిర్వహణ లోపాలను గుర్తించారు. రెండు పర్యాయాలు ప్రత్యేకంగా ఆలయాన్ని సందర్శించి దేవస్థాన పాలనా వ్యవహారాల్లో కొంత మార్పులను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుండగానే ఆయన అనారోగ్యానికి గురయ్యారు. దీనికి తోడు కలెక్టర్ నారాయణరెడ్డి కూడా రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.

ఇప్పుడు ఆర్డీవో: ప్రస్తుతం దేవస్థానంలో పాలన గాడితప్పి అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో గత కలెక్టర్ నారాయణరెడ్డి మాదిరిగానే ప్రస్తుత కలెక్టర్ ఇలా త్రిపాఠి కూడా ఆర్డీవోను పంపి రికార్డులను తనిఖీ చేయాలని ఆదేశించింది. రెగ్యులర్ సిబ్బంది తక్కువగా ఉండటంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకున్నారు. ఈ విషయంలో కూడా కొన్ని ఆరోపణలు అధికారులకు చేరాయి. దీంతో రికార్డుల తనిఖీ సమయంలో తన దృష్టికి వచ్చిన రికార్డుల నిర్వహణ తీరును ఆర్డీవో నోట్ చేసుకున్నారు. కింది స్థాయి సిబ్బంది తప్పు చేస్తే ఆ తప్పుకు బాధ్యత వహించాల్సి వస్తుందన్న విషయం తెలియదా అంటూ ఆర్డీవో వ్యాఖ్యానించడంపై ఏం జరుగుతుందోనన్న ఆందోళన దేవస్థాన సిబ్బందిలో నెలకొంది.



రికార్డుల అసంపూర్తిపై చెర్వుగట్టు దేవస్థానం ఈవోను ప్రశ్నిస్తున్న ఆర్డీవో

క్షేత్రం...వైశిష్ట్యం

● ఒక్కో క్షేత్రానికి ఒక్కో విశిష్టత

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మహాశివరాత్రికి సిద్ధమవుతున్న ఆలయాలు

మహాశివరాత్రికి ఉమ్మడి జిల్లాలోని శివాలయాలు ముస్తాబువుతున్నాయి. ఒక్కో ఆలయానిది ఒక్కో చారిత్రక నేపథ్యం. సారూప్యం లేని విశేషగుణాల సమాహారంగా నిలుస్తున్నాయి ఆలయాలు. ఆలయాలు శిల్ప సందపదకు నిలయాలుగా ఉన్నాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయాల్లో వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఛాయాసోమేశ్వరాలయం, వాడపల్లిలోని మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయం, సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో భృగుమహర్షి చేతి నుంచి జపమాల జారపడంతో నెలకొల్పిన సోమేశ్వరా లయం, పిల్లలమర్రిలోని త్రికూటేశ్వరాలయం, యాదాద్రిభువనగిరి జిల్లా కొలను పాకలోని సోమేశ్వరాలయాలు మచ్చుతునకలుగా నిలుస్తున్నాయి. ఇలాంటి విశేషాలు కలిగిన ఆలయాల సమాహారమే ఈ కథనం..



నల్లగొండ సమీపం పానగల్‌లోని ఛాయాసోమేశ్వరాలయం

ఛాయ

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)

నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని పానగల్లు శివాలయాలు సంస్కృతికి శిలా సంపదకు నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. శతాబ్దాల నాటి కళా శిల్ప సంపద నేటికీ చెక్కు చెదరలేదు. కాకతీయుల కాలంలో పానగల్లు రాజధానిగా చేసుకొని పరిపాలించిన సమయంలోనే ఛాయ, పచ్చల సోమేశ్వరాలయాలు నిర్మించారు. క్రీ.శ 10-12 శబ్దాల కాలం మధ్య కుందూరు చోళులు తమ ఆరాధ్య దైవమైన పరమేశ్వరుడిని కోసం ఈ ఆలయాలను నిర్మించారు. ప్రస్తుతం ఈ ఆలయాలు మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి పర్వదినాలల్లో భక్తులతో అలరారుతున్నాయి. నిరంతర ఏకా నిశ్చలాకార నీడ గర్భగుడిలో కనిపించడమే ఈ ఆలయ విశిష్టత. గర్భగుడి ముఖద్వారం ముందు రెండు స్థంభాలు ఉన్న అన్ని సమయాలల్లో ఒకే నీడ పడుతుంది. అది వెలుతురు ఉన్నంత సేపు కదలకుండా ఒకే స్థానంలో ఉండటం విశేషం. సూర్యుని గమనంలో మార్పు ఉన్న కూడా ఆ నీడను మార్చదు. శివలింగం ఈ ఛాయచే కప్పబడి ఉంటుంది. ఈ ఛాయ కారణంగా ఈ దేవాలయం శ్రీ ఛాయ సోమేశ్వర స్వామి దేవాలయంగా పిలవబడుతుందని చెప్పవచ్చు. 11, 12వ శతాబ్ద కాలానికి చెందినదిగా శ్రీ ఛాయ సోమేశ్వర ఆలయం గురించి చెప్పుతుంటారు. కుందూరు చోళుల కాలంలో నిర్మించారు. ఈ దేవాలయంలో లభించిన ఒక శాసనం క్రీస్తుశకం 1290 కాకతీయ ప్రభుత్వం ప్రతాపరుద్రుడిని పేరు మీద ఉంది.

పచ్చల సోమేశ్వరాలయం...



జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని పానగల్లు ఉదయసముద్రం పక్కన పచ్చల సోమేశ్వరాలయం ఉంది. స్వామి వారికి ఆలయంలో పచ్చలహారం ధరింప జేయడం వల్ల విద్యుత్ లేని సమయంలో కూడ ఆలయం అంతా పచ్చగా విరాజల్లుతుండటంతో దీనికి పచ్చల సోమేశ్వరాలయం అని పేరు వచ్చింది. కుందూరు చోళుల ఉదయాదిత్యుడు ఈ ఆలయాన్ని నిర్మించినప్పుడు మధ్యయుగపు శిల్పకళా నైపుణ్యానికి గుర్తుగా నల్లరాతితో చెక్కిన శిలా కళాకృతులతో 25 వరుసలలో నిర్మించారు. లింగరూపంలో ఉన్న మూలవిరాట్ గ్రీన్ వనిక్స్ రాయి నుంచి తయారు చేయబడింది. నల్లగొండ పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలో ఛాయ సోమేశ్వరాలయం ఉంది. నల్లగొండ బస్టాండ్ నుంచి నకిరేకల్ వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని ఈ ఆలయం వద్ద నిలుపుతారు. అదేవిధంగా పచ్చల సోమేశ్వరాలయం పానగల్లుకు వెళ్లిన తరువాత కొద్దిదూరం వెళ్లగానే ఈ ఆలయం దర్శించుకోవచ్చు. దాని పక్కనే శ్రీ వెంకటేశ్వర ఆలయం కూడ ఉంది.

● పంచపీఠాల్లో మొదటిది సోమేశ్వరాలయం



(ఆంధ్రజ్యోతి-ఆలేరురూరల్)

దేశంలోని అత్యంత విశిష్టమైన శైవ క్షేత్రాల్లోనే యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలోని చండికా సమేత సోమేశ్వరాలయం పంచ పీఠాల్లో మొదటిదిగా వీరశైవులు పూజిస్తారు. రెండవది సిద్ధేశ్వరస్వామి(ఉజ్జెయిని), మూడోది భీమనాథ స్వామి(కేధరినాథ్), నాలుగోది మల్లిఖార్జునస్వామి(శ్రీశైలం), ఐదోవది విశ్వేశ్వరస్వామి(కాశీ)లో ఉన్నాయి. వీరశైవ మనస్థాపకుడిగా పూజింపబడుతున్న జగద్గురు రేణాకుచార్యులు ఇక్కడే లింగోద్భవం చెందినట్లు స్థల పురాణం చెబుతోంది. అదేవిధంగా ఇక్కడే ఆయన లింగైక్యం చెందారని భక్తుల విశ్వాసం. క్రీ.శ.1070-1126 మధ్య పశ్చిమ చాళుక్యుల పాలనలో ఆలయం నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ఇక్కడి లింగాన్ని పుట్టు లింగం లేదా స్వయంభు లింగంగా భావిస్తారు. ఈ లింగమే రెండుగా చీలి దానిలో నుంచి జగద్గురు రేణుకాచార్యులు ఆవిర్భవించి లింగోద్భావం చెందారన్నది భక్తుల భావన. ఈ ఆలయం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై సమదూరంలో ఉన్న ఆలేరుకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. హైదరాబాద్‌లోని కుక్కట్‌పల్లి, జగద్గిరిగుట్ట, కోటి, ఉప్పల్ నుంచి గంటకు ఒక బస్సు సర్వీసు సౌకర్యం ఉంది. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వీరశైవ భక్తులు రైలు ద్వారా ఆలేరుకు చేరుకొని కొలనుపాకకు వెళ్తుంటారు.

కోటి లింగేశ్వరాలయం

ఈగుడిలో ఉన్న లింగాన్ని కోటేశ్వరాలయం అంటారు. పంచ కోసు నగరంగా పిలువబడే ఈ క్షేత్రంలో కోటి లింగాలను ప్రతిష్ఠించే సమయంలో వెయ్యి లింగాలు తక్కువ అవడంతో ఒకే రాయిపై వెయ్యి లింగాలను చెక్కి ప్రతిష్ఠించారు. వెయ్యి లింగాలను చెక్కి ప్రతిష్ఠింపజేయడంతో అదే కోటి లింగేశ్వరాలయంగా ప్రసిద్ధి చెందింది.

● మేళ్లచెర్వులో పెరిగే శివలింగం



(ఆంధ్రజ్యోతి-మేళ్లచెర్వు)

మేళ్లచెర్వు మండలకేంద్రంలోని ఇష్టకామేశ్వరీ సమేత స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో పెరిగే శివలింగం ఇక్కడి ప్రత్యేకత. శివలింగం వెనుక రెండు వేలు పట్టేంత లోతైన రంధ్రం ఉంటుంది. ఇందులో ఏ కాలంలోనైనా నిండుగా, చేతివేలకు అందే లోతులో నీళ్ల నిండుగా ఉంటాయి. లింగాకారం వెనుక వైపున జడల వంటి ఛారలు ఉండటంతో అర్ధనారేశ్వరిస్వామిగా భక్తుల నమ్మకం. శివలింగానికి, పానగట్టానికి ఏ శివాలయంలో లేనివిధంగా మధ్య ఖాళీ ప్రదేశం ఉండటం విశేషం. ఈ ఖాళీ ప్రదేశం ప్రతి పుష్కరానికి ఒక్కసారి ఒక్క అంగుళం చొప్పున పెరగడం ఇక్కడి ప్రత్యేకత.

● మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ నిర్వహించే జాతర రాష్ట్రంలోని అతిపెద్దజాతరల్లో ఒకటిది. ఐదురోజుల పాటు నిర్వహిస్తారు. శివరాత్రి జాగారం సందర్భంగా ఏర్పాటుచేసే విద్యుత్ ప్రభలు, వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అదే విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేని విధంగా ఒంగోలు జాతి ఎద్దుల పందేలు జాతరకు ప్రత్యేక ఆకర్షణ. ప్రతి ఏడాది 50, 60 జతల ఎద్దులు పాల్గొంటాయి. జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ ఏడాది జాతరను ఈ నెల 25 నుంచి మార్చి 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. హుజూర్‌నగర్ నుంచి 12 కిలోమీటర్లు, కోదాడ పట్టణానికి 22 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. ఈ ఆలయం చేరుకొనేందుకు జాతర సందర్భంగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు.

● శ్రీరాముడు పూజించడంతో శ్రీరామలింగేశ్వరుడిగా..



(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం కాకతీయుల కాలంలో నిర్మించింది. రావణాసురుడు సీతను అపహరించినప్పుడు శ్రీరామచంద్రుడు సీతను వెతుకుతూ వెళుతున్న క్రమంలో ఆలయం పక్కనే ఉన్న బిక్కేరు వాగులో స్నానమాచరించి ఆలయంలోని శివలింగానికి పూజలు చేయడంతో అప్పటి నుంచి ఈ ఆలయం శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంగా పేరొందింది. సహజంగా దేవాలయాల ముఖ ద్వారాలు తూర్పు దిశన ఉంటుండగా ఇక్కడ పడమర దిక్కు ఉంటుంది. ఆలయం ముందు ఉన్న ఎత్తైన రాతి ద్వారం ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆలయం చుట్టూ రాతి మాళిగ ఉంటుంది. ఆలయంలో నిత్య పూజలతో పాటు ప్రతి యేట బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. కాముని దహనం రోజు(హోలి పండుగ రోజు) స్వామి కల్యాణం నిర్వహిస్తారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో అగ్నిగుండాలు ప్రధాన ఘట్టం. మహాశివరాత్రి వేడుకలకు ఆలయాన్ని సిద్ధం చేస్తున్నారు. మహా శివరాత్రి రోజు రాత్రి పార్వతీపరమేశ్వరులను పల్లకిలో పట్టణమంతా ఊరేగిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి, భద్రకాళి అమ్మవారు, వీరభద్రుడు, మల్లన్న స్వామి ఉపాలయాలు ఉన్నాయి. మోత్కూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రాల నుంచి మోత్కూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

● జపమాల జారిన ప్రదేశమే సోమప్ప ఆలయం



(ఆంధ్రజ్యోతి-నేరేడుచర్ల)

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని సోమప్ప దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నేరేడుచర్ల మండల బూర్గుల తండా గ్రామపంచాయతీ పరిధిలోని మూసీ నది ఒడ్డున ఈ పుణ్యక్షేత్రం ఉంది. దక్షిణ ప్రజాపతి హోదాలో పూజలందుకున్న సోమేశ్వరుడు మూసీనది తీరాన వెలిశాడు. ఇక్కడ ఉన్న స్వామిని భృగుమాలికా సోమేశ్వరుడు అంటారు. ముల్లోకాలను తిరుగుతూ వచ్చి కలియుగ ప్రారంభంలో ఒక రోజున, మహర్షి ముచుకుందా నది(ప్రస్తుత మూసీనది)లో స్నానం చేసి వచ్చి జపం చేస్తుండగా అకస్మాత్తుగా చేతి నుంచి జారిపడింది. జపమాలను ఆకర్షించిన ప్రదేశాన్ని మహర్షి, అత్యంత పవిత్రస్థలంగా గుర్తించి, తనకు ఇష్ట దైవం అయిన శివుడి లింగరూపంలో ప్రతిష్ఠింపచేశాడు. అందువల్లనే ఈ స్వామిని భృగుమాలికా సోమేశ్వరుడు అని పిలుస్తారు. ఈ ఆలయంకు మరో ప్రత్యేకత వుంది. శివుడి ఆరాధనా రూపాలైన శివలింగాలు దేవాలయంలో మూడు వున్నాయి. అందులో ఒకటి గర్భగుడిలో ఉండగా, రెండవది గర్భగుడికి ఎదురుగా, మూడవది దేవాలయం ప్రాంగణంలో ఉంటుంది.

ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాన్ని ముస్తాబుచేశారు. 24 నుంచి 28 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లుచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ తెలిపారు. దేవాలయానికి కిలోమీటరు దూరంలో ఒక గుట్టపై భూగృహం ఉంది. దీనిని బల్లవుమని అనే వారని నానుడి. ఈ భూగృహం నుంచి వచ్చి మునులు దేవాలయంలో నిత్యంపూజలు చేసే వారని భక్తుల నమ్ముతుంటారు. మట్టపల్లికి చెందిన తంబిళ్ల పిచ్చయ్యశాస్త్రి భూగృహంలో నివసించే మునులను దర్శించి తన జీవితకాలం అంతా మునులకు, ఆలయానికి సేవలు చేస్తూ గడిపారని తమ పూర్వీకులు చెప్పినట్లు ఆలయంలో పనిచేసే పూజారి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు జాతర నిర్వహించే జాతరలో 26న రాత్రి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సత్యనారాయణ తెలిపారు. సోమప్ప ఆలయం కోదాడ-జడ్చర్ల రహదారిపై ఉన్న చిల్లేపల్లికి 6.5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మిర్యాలగూడ నుంచి సోమప్పకు 18 కిలోమీటర్లు, నేరేడుచర్ల నుంచి సోమప్పకు 12 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మిర్యాలగూడ డిపో నుంచి ఈనెల 26వ తేదీన ప్రత్యేక సర్వీసులు నడుపనున్నారు. అదేవిధంగా ఆటోల సౌకర్యం ఉంది.

అగస్త్య ముని ప్రతిష్ఠించిన శివలింగం

(ఆంధ్రజ్యోతి-దామరచర్ల)

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలోని కృష్ణా, మూసీ నదుల సంగమ ప్రాంతంలో కొలువైన శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో కృతయుగంలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించినది ప్రసిద్ధి. ఈ శివలింగానికి ప్రత్యేక కథ ఒకటి ఉంది. ఒక బోయవాడు పక్షిని వేటాడుతుండగా అది శివలింగం వెనక దాక్కుంది. దీంతో బలవంతంగా పక్షిని చంపబోయిన బోయవాడితో శివుడు ఇలా అన్నాడట తన శరణు కోరి వచ్చిన పక్షికి హాని చేయవద్దని దానికి ప్రతీగా తన మాంసం తీసుకోవాలని అన్నాడట. దీంతో ఆ బోయవాడు తన చేతి 10 వేళ్లతో శివలింగంపై భాగంలోని మాంసాన్ని పెకిలిస్తాడు. ఆ వెంటనే ఆ ప్రాంతంలో గంగ ఉద్భవించిందని పురాణాలు చెబుతున్నాయి. తదనంతర కాలంలో శివలింగం పుట్టతో నిండిపోయింది. 600ఏళ్ల క్రితం రెడ్డిరాజులు పరిపాలనలో తవ్వకాల్లో శివలింగం బయటపడింది. దీంతో వారు ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి స్వామివారు శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామిగా విరాజిల్లుతున్నారు. శివలింగం పై భాగం నుంచి గంగ నిత్యం తోడినకొద్ది ఉద్భవిస్తుంటుంది. 1524లో ఈ వింతను పరీక్షించబోయిన జగద్గురు ఆదిశంకరాచార్యులకు భంగపాటు ఎదురైంది. మహాశివరాత్రి, ఏకాదశి, కార్తీకమాసంలో భక్తుల రద్దీతో కిటకిటలాడుతుంది. ఆలయానికి మిర్యాలగూడ నుంచి వాడపల్లికి 25కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆలయం నార్కట్‌పల్లి- అద్దంకి రహదారికి కిలో మీటరు దూరంలో ఉంటుంది. మిర్యాలగూడ డిపో నుంచి వాడపల్లి మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కలదు.

● ఆలయ ప్రాంగణంలోని మరో విశిష్టమైన ప్రాశస్త్యం కలిగిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిత్యం పూజలతో విరాజిల్లుతుంది. ఆలయంలోని స్వామి ఎదుట ఉన్న రెండు ప్రమిదల్లో ఎగువ భాగంలో ఉన్న ప్రమిద కదులుతుండగా దిగువ భాగంలోని ప్రమిద నిశ్చలంగా ఉంటుంది. స్వామివారి ఉచ్వాస, నిశ్వాస కారణంగా ఎగువ భాగంలోని ప్రమిద కదులుతున్నట్లు భక్తుల విశ్వాసం.





●స్వామి వారే కలలో చూపించిన ఆలయం

(ఆంధ్రజ్యోతి-బీబీనగర్)

మట్టిలో కూరుకపోయిన ఆలయాన్ని స్వామి వారే కలలోకి వచ్చి చూపించిన ఆలయం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్ గ్రామంలో కొలువైన అక్కన్న మాదన్న ఆలయాలు. నిజాం ఆస్థానంలో 400 ఏళ్ల కిందట మంత్రిగా, సేనాధిపతిగా అక్కన్న మాదన్న అనే ఇద్దరు అన్నదమ్ములు పనిచేసేవారు. వారు కప్పం వసూలుకు వరంగల్, భువనగిరి ఆస్థానానికి వెళ్తుండేవారు. బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్ గ్రామంలోని మట్టిదిబ్బల వద్ద కాసేపు సేద తీరుతుండేవారు. ఒక రోజు సేదతీరుతుండగా సాక్షాత్తు ఆ భగవంతుడే కలలోకి వచ్చి మట్టిదిబ్బల్లో కొలువై ఉన్నానని, దర్శించుకోవాలని ఆదేశించాడు. తేరుకున్న అన్నదమ్ములు మట్టిదిబ్బలను తొలగించే పని చేపట్టగా, కళ్లు చెదిరే కళాకృతులతో ఉన్న రాతితో కట్టబడిన ఆలయాలు బయటపడ్డాయి. ధ్వంసమైన వాటిని పునర్నిర్మాణం చేపట్టారు. అదేసమయంలో వారి మేనల్లుడు భక్త రామదాసు భద్రాచలంలో రామాలయ నిర్మాణం చేపట్టినందుకు నిజాం ప్రభువు రామదాసును బంధీఖానా చేశారు. దాంతో అక్కన్న మాదన్నలు ఇక్కడి ఆలయాల పునర్నిర్మాణ పనులు నిలుపుదల చేసి విగ్రహాలను ప్రతిష్ఠించి యథాస్థితిలో ఉంచారు. అందుకే ఈ ఆలయాలకు అక్కన్న మాదన్న ఆలయాలుగా వాడుకలోకి వచ్చాయి. అయితే సుమారు 700 ఏళ్ల క్రితం కాకతీయుల కాలంలో నిర్మించినట్లుగా చరిత్రకారులు చెబుతున్నారు. ఇక్కడి ఆలయాల్లో మూడు మండపాలు ఉండగా ఒక దానిలో వేణుగోపాలస్వామి కొలువై ఉండగా మరో రెండు మండపాల్లో ఉమామహేశ్వర స్వామి వేర్వేరుగా కొలువై ఉండటం ఇక్కడి విశేషం. మహాశివరాత్రి పార్వదినాన్ని పురస్కరించుకుని ఏటా ఐదు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

● శిలల కాణాచి పిల్లలమర్రి



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట రూరల్)

కాకతీయుల కళాసంపదకు సజీవ సాక్ష్యంగా పిల్లలమర్రి దేవాలయాలు నిలుస్తాయి. కాకతీయుల సైన్యాధిపతి తల్లిదండ్రుల పేరుతో నిర్మించిన ఆలయాలు సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలో ప్రసిద్ధి చెందిన ఎర్రకేశ్వరాలయం, నామేశ్వరాలయం. నల్లని ఏకరాతి శిల్పంతో ఎంతో అందంగా దేవాలయాలను నిర్మించారు. రెండవ ప్రోలరాజు కాకతీయ రాజ్యాన్ని పాలించే సమయంలో ఆయన దగ్గర కామిరెడ్డి సైన్యాధిపతిగా పనిచేసేవాడు, ఆయనకు కాటిరెడ్డి, బేతిరెడ్డి, నామిరెడ్డి కుమారులు. బేతిరెడ్డి కాకతీయ రుద్రరాజుకు సమకాలికుడై అనేక యుద్ధాల్లో విజయం చేకూర్చారని ప్రసిద్ధి. నామిరెడ్డి తన తల్లిదండ్రుల పేరు మీద క్రీస్తుశకం 1195లో త్రికుటేశ్వరాలయం, 1202లో పార్వతీ మహదేవ నామేశ్వరస్వామి ఆలయాలను నిర్మించాడు. క్రీస్తుశకం 1208లో బేతిరెడ్డి ఆయన భార్య ఎరకసానమ్మ పేరు మీద ఎర్రకేశ్వరాలయాన్ని నిర్మించినట్లు అక్కడ ఉన్న శాసనాలు తెలుపుతున్నాయి. ఈ శివాలయాలు సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి మూడు కిలోమీటర్లు, హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి(65) నుంచి కిలోమీటరు దూరంలో మాత్రమే ఉన్నాయి.

కళా సంపదకు సజీవ సాక్ష్యం

కాకతీయుల నాటి కళా సంపదకు పిల్లలమర్రి దేవాలయాలు సజీవ సాక్ష్యంగా నిలుస్తాయి. ఎత్తున గోపురాలు, నల్లరాతితో కూడిన ముఖమండప స్తంభాలతో నిర్మించారు. 72 నియోమాల శిల్పులు ఆలయ నిర్మాణంలో పాల్గొన్నారు. నామేశ్వరాలయంలో నాణెలతో స్తంభాలపై కొట్టినప్పుడు సప్త స్వరాలు వినిపించడం ఆ దేవాలయం ప్రత్యేకత. ఔరంగజేబు జరిపిన దాడుల్లో ఈ ఆలయాల్లోని శిల్పాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

● సంగమస్థానంగా సంగమేశ్వరుడు



(ఆంధ్రజ్యోతి-మోతె)

సూర్యాపేట జిల్లా మోతె మండలంలో సంగమేశ్వరస్వామి ప్రసిద్ధి. వరంగల్, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నడుమ ప్రవహిస్తున్న లోతైన మూడు వాగులు కలిసే చోట ఏర్పడడంతో పూర్వీకులు సంఘమస్థానంగా సంగమేశ్వరస్వామిని నెలకొల్పారు. నిత్యం వాగులో నీరు సమృద్ధిగా ఉంటుంది. రెండు శతాబ్ధాలైనా ఆలయ నేటికీ చెక్కుచెదరలేదు. ఆలయభూముల ద్వారా వచ్చే నిధులతో నిత్య, దూపదీప నైవేద్యాలు, కల్యాణం, వారంపాటు జాతర నిర్వహిస్తారు. కల్యాణానికి ఆలయ సమీపంలోని మూడు జిల్లాల భక్తులు వస్తుంటారు. ఒకే కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు అర్చకులుగా కొనసాగుతున్నారు. ఈ ఆలయం సూర్యాపేట-ఖమ్మం, వరంగల్-ఖమ్మం జాతీయ రహదారులకు 30 కిలోమీటర్లు ఉంది. మోతె మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

● మూడు లింగాల క్షేత్రమే త్రికూటేశ్వరాలయం



(ఆంధ్రజ్యోతి-పెన్‌పహాడ్)

సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని నాగులపహాడ్ గ్రామ పరిధిలో పవిత్రమైన మూసీఒడ్డున శాలివాహన శకం 1156 జయనామ సంవత్సరం వైశాఖ శుద్ధ త్రయోదశిన కాకతీయులు శ్రీనామేశ్వర, శ్రీఐతేశ్వర, శ్రీకాలేశ్వర పేర్లు గల మూడు శివలింగాలను ఒకే దేవాలయంలో మూడు కూటాల్లో ప్రతిష్ఠించారు. దీంతో ఈ ఆలయాన్ని త్రికూటేశ్వర ఆలయంగా పేర్కొంటారు. దేవాలయాలు పాలరాతి, నల్లరాతి శిలలతో చాలా అద్భుతంగా ఉంటుంది. ఈ బండలపై దేవాతామూర్తు విగ్రహాలతో పాటు ఆనాటి చరిత్ర రాసి ఉంది.

అనంతగిరిలో నేటి నుంచి కల్యాణోత్సవాలు

(ఆంధ్రజ్యోతి-అనంతగిరి)

సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని శ్రీ గంగా పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం మహాశివరాత్రి సందర్భంగా కల్యాణోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 25వ తేదీ నుంచి 28 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తీగల నర్సింహారావు తెలిపారు. 25వ తేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 26వ తేదీ రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. 27న అభిషేకాలు, అర్చనలు, నవగ్రహ పూజలు జరుగుతాయి. 28న స్వామి వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తారు.

50 ఏళ్లు ఒకే కుటుంబం నిర్వహణ

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈ పర్యాయం 51వ వార్షిక మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 50 ఏళ్ల నుంచి ఒకే కుటుంబం సొంత ఖర్చులతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తోంది. 1930 ప్రాంతంలో చౌటుప్పల్‌లో బొడ్రాయికి సమీపంలో పడమటి దిశలో బోనమ్మ(అమ్మవారు) గుడిని గ్రామపెద్దలు నిర్మించారు. అదేవిధంగా దేవాలయం ముందున్న రావిచెట్టు కింద శ్రీరామనవమి వేడుకలను నిర్వహించేవారు. కొంతకాలానికి శివపార్వతుల ఫొటోలను పెట్టి ఉత్సవాలను నిర్వహించేవారు. 1968లో స్థానిక వ్యాపారవేత్త ఉప్పల వెంకటయ్య గుప్తా- వెంకటమ్మ దంపతులు కాశీ నుంచి శివలింగాన్ని తీసుకువచ్చి బోనమ్మ గుడిలో ప్రతిష్ఠించారు. ఆ తరువాత 1974 నుంచి వారే మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవాలను అదే రావిచెట్టు కింద చేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు ఉప్పల వారి కుటుంబమే ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తోంది. వెంకటయ్యగుప్తా కాలం చేసిన అనంతరం కుమారులు కృష్ణ, అశోక్ కుమార్ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అనంతరం 1999లో బోనమ్మ గుడి స్థానంలో సీతారామచంద్రస్వామి దేవాలయ సముదాయాన్ని నిర్మించారు. అందులో ఒక పక్కన కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, మరో పక్క రామాలయం, ఇంకో పక్కన దుర్గామాత దేవాలయాను నిర్మించారు.



శంకు ఆకారంలో శివలింగాలు

(ఆంధ్రజ్యోతి-మర్రిగూడ)

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని మేటిచందాపురంఇందుర్తి గ్రామంలో 1240 ఏళ్ల కిందట ఒక వ్యవసాయ భూమి వద్ద శివలింగాలు ఉండేవి. ఇవి శంకు ఆకారం ఉండటం పూర్వీకులు ఇక్కడ ఆలయాన్ని నిర్మించి శంభులింగేశ్వరస్వామి ఆలయంగా నామకరణం చేశారు. అయితే శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించి, ప్రత్యేక పూజారిని ఏర్పాటు చేసి నిత్య దీపారాధన కొనసాగి స్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుంభం వెంకట్‌రెడ్డి తెలిపారు. శివలింగాలు దొరికే ఈ ప్రాంతాన్ని లింగాల గడ్డ అని పిలిచేవారు.



బెల్లం, పటిక పట్టివేత

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటిక తరలిస్తుండగా సూర్యాపేట ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట ఎక్సైజ్ సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సచిన్‌కుమార్ జైన్ అనే వ్యాపారి ఓ గూడ్స్ వాహనాన్ని యాప్ ద్వారా బుక్ చేసుకున్నాడు. అందులో హైదరాబాద్‌లో సారా తయారీకి ఉపయోగించే సుమారు రూ.4లక్షల విలువ చేసే 3,354 కిలోల నల్లబెల్లం, రూ. 12లక్షలు విలువ చేసే 500 వందల కిలోల పటికతో పాటు అల్లం, ఎల్లిపాయలు, మరమొరాలను లోడ్ చేసి సూర్యాపేట మీదుగా మహబూబాబాద్‌కు తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బాలరాజు, నితిన్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, కౌషిక్, శేఖర్ సూర్యాపేటలోని జనగాం క్రాస్ రోడ్డు దాటిన తర్వాత విజయవాడకు వెళ్లే దారిలో ఆ వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో నల్లబెల్లం, పటిక లభించాయి. వాహనంతో పాటు వాహన డ్రైవర్ గోపాల్‌ను అదుపులోకి తీసుకుని సూర్యాపేట ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ గోపాల్, వ్యాపారి సచిన్‌కుమార్ జైన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బొత్తలపాలెంలో నకిలీ నోట్ల కలకలం



దామరచర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అసలు నోట్లను పోలిన నకిలీ నోట్లు నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం గ్రామ శివారులోని నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి పక్కన పంట పొలాల్లో సోమవారం లభ్యమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సమీపంలోని ఓ రైతు పొలానికి వెళ్తుండగా కరెన్సీ నోట్లు కలిగిన ఓ సంచి గుర్తించాడు. రూ.500 నోట్లతో కూడిన సుమారు 40కట్టలు ఉండగా వాటిలో కొన్ని స్థానికులు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మిగిలిన నోట్లను స్వాధీనం చేసుకొని సీఐ వీరబాబు విచారణ నిర్వహించారు. నకిలీ నోట్లపై 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా' అని ఉంది. ఈ నోట్లు చిన్నారులు ఆడుకోవడంతోపాటు పలు ఫంక్షన్లకు, వివిధ కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య



నగేష్ (ఫైల్)

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కుక్కడంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుక్కడం గ్రామానికి చెందిన కొంపెల్లి నగేష్(42) 18 ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమలాపురానికి చెందిన ఉమాతో వివాహం జరిగింది. వీరు అక్కడే నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కొన్నేళ్లుగా నగేష్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మూడు నెలల క్రితం అమలాపురం నుంచి స్వగ్రామానికి వచ్చి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఏపనీ చేయలేక చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి ఉండడంతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గ్రామంలోని పలువురికి సమాచారం ఇచ్చి చెరువు దగ్గరకు వెళ్లారు. అక్కడ చెరువు కట్టపై చెప్పులు ఉండడంతో కొందరు చెరువు వద్దకు వెళ్లి గాలించగా, అక్కడ నగేష్ మృతదేహం లభించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు పంచనామా నిర్వహించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది..

చింతపల్లి: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొదరబండ గ్రామానికి చెందిన దాసరి బాయన్న(25), బాలమ్మ ఇద్దరు కలిసి చింతపల్లికి చెందిన వూరె ఆంజనేయులుకు చెందిన గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. బాయన్న అప్పుడప్పుడు మద్యం తాగి వస్తుండడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో జీవితంపై విరక్తి చెంది మనస్తాపానికి గురైన బాయన్న ఆదివారం అర్ధరాత్రి సాయిరెడ్డిగూడెం గ్రామశివారులో పత్తి పొలంలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం భర్త కన్పించకపోవడంతో భార్య బాలమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపడుతుండగా పత్తి పొలంలో బాయన్న మృతదేహం కన్పించింది. బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొనుగోళ్లు లేక మూత

● ప్రారంభించిన కొన్నాళ్లకే మూతపడిన కందుల కొనుగోలు కేంద్రం

మోత్కూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పంటలు దళారులకు తక్కువ ధరకు విక్రయించి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాలు చేసిన కందులకొనుగోలు కేంద్రం కొన్నాళ్లకే మూతపడింది. ఈ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు కందులు విక్రయించాక యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో ఒకే ఒక్క కొనుగోలు కేంద్రాన్ని జనవరి 26న ఎమ్మెల్యే మందుల సామేలు ప్రారంభించారు. మోత్కూరు ఎంఈవో టి. గోపీనాథ్‌ను కందుల నాణ్యతా పరిశీలకుడిగా నియమించారు. వంద క్వింటాళ్ల పైన కందులు వస్తేనే కొనుగోలు చేస్తామని కొన్ని రోజులు కొనలేదు. కందులకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,550 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.6,100 నుంచి రూ.7,100 వరకు కొనుగోలు చేస్తుడడంతో రైతులు వంద క్వింటాళ్లపైన కందులను కొనుగోలు కేంద్రంలో రాశులు పోశారు. తూర్పార పట్టి శుభ్రం చేసి, మూడు, నాలుగు రోజులు ఆరబెట్టినా తేమ శాతం 12కన్నా ఎక్కువ ఉందం టూ కొనలేదు. దీంతో విసిగిన రైతులు శాపనార్థాలు పెడుతూ ప్రైవేట్ వ్యా పారులకు విక్రయించడానికి తీసుకెళ్లారు. ఈ దుస్థితిపై 'కందులు కొనేవారేరీ...?' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ద్వారా వెలుగులోకి తెచ్చినా అధికారులె వరూ స్పందించలేదు. మిగిలిన కందుల రాశులపై కోతులు, పందులు ఎగ బడటం, నిర్వాహకులు కొనుగోలు చేయకపోవడంతో మిగిలిన రైతులు కూడా ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవడానికి తీసుకెళ్లడంతో గుట్టుచప్పుడు కాకుండా నిర్వాహకులు కేంద్రాన్ని మూసి వేశారు.

నేటితో ప్రచారానికి తెర



(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయుల కోసం చేసే పోరాటాలు, ఉపాధ్యాయ సమస్యలపై తాము చేసిన పోరాటాలు, ఉద్యమాలతోపాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై తమ వైఖరులను సోషల్ మీడియా వేదిక గా పంచుకున్నారు. తమకు మద్దతిచ్చే సంఘాల ప్రతినిధులతో కూడిన వాట్సప్‌గ్రూపులు, ఉపాధ్యాయులుండే ప్రతీ వాట్సాప్ గ్రూపులతో ప్రతిరోజూ తమ కార్యక్రమాలను అప్‌డేట్ చేయడంతోపాటు, తమ విన్నపాన్ని సూచిస్తూ పోస్టులు కొనసాగించారు. గత ఎన్నికలకు పూర్తి భిన్నంగా ఈసారి సోషల్‌మీడియాలో ఉధృతస్థాయిలో ప్రచారం సాగింది.

సంఘాల్లో క్రియాశీలకంగా లేని ఉపాధ్యాయులపై ప్రత్యేక దృష్టి

పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులంతా తమకు మద్దతిచ్చే సంఘాల సభ్యులైన ఉపాధ్యాయులతో పాటు సంఘాల్లో క్రియాశీలకంగా లేని, తటస్థవైఖరితో ఉండే ఉపాధ్యాయులపై ఎక్కువగా శ్రద్ధ పెట్టారు. ప్రధాన సంఘాల్లో సభ్యత్వాలున్నప్పటికీ క్రియాశీలకంగా లేనటువంటి ఉపాధ్యాయులను గుర్తించి వారి మద్దతు కోసం అభ్యర్థులు, వారికోసం పనిచేస్తున్న ఉపాధ్యాయ నాయకులు కృషి చేస్తున్న పరిస్థితి క్షేత్రస్థాయిలో నెలకొంది. ఇలాంటి ఉపాధ్యాయులు ఎక్కువగా ఉండే చిన్నచిన్న సంఘాల నేతలను తరచూ కలుస్తూ తమకు మద్దతివ్వాలని కోరుతున్నారు. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల ఉపాధ్యాయులు, ఆదర్శపాఠశాలల ఉపాధ్యాయులు, కేజీబీవీ టీచర్లు, భాషా పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, రికగ్నైజ్డ్ స్కూళ్ల టీచర్లు, ఎయిడెడ్ స్కూళ్ల టీచర్ల ఓట్లపైన అభ్యర్థులు ఎక్కువగా దృష్టి సారించడం ఈసారి ఎన్నికల్లో ప్రత్యేకతగా చెప్పవచ్చు. మరోవైపు పోటీలో ఉన్న అభ్యర్థుల్లో నామమాత్రంగా ఉన్న అభ్యర్థుల మద్దతు సాధించేందుకు ప్రధాన అభ్యర్థులు చర్చలు జరుపుతున్నారు.

బీజేపీ మినహా కనిపించని రాజకీయ హడావిడి

ఈ ఎన్నికల్లో బీజేపీ మాత్రమే తమ అభ్యర్థిని నేరుగా బరిలో దించగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎవరికీ మద్దతివ్వలేదు. దీంతో బీజేపీ నేతలు మినహా మిగిలిన పార్టీల నేతలెవరూ ఈఎన్నికపై ఎక్కడా స్పందించలేదు. ప్రచారం చేయలేదు. ఈనియోజకవర్గ పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాల్లో బీజేపీకి ఎక్కడా ఎమ్మెల్యేలు, ఎంపీలు లేకపోయినా, సంస్థాగతంగానూ ఇతర పార్టీలతో పోల్చితే చెప్పుకోదగ్గ బలం లేకపోయినా ఆపార్టీ ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంపై రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, ఎంపీలు ఈటెల రాజేందర్ సహా ఇతర కీలకనేతలంతా ప్రచారంలో పాల్గొనడమే కాకుండా గెలుపుకోసం పార్టీ అప్పగించిన కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలనే దిశగా ప్రత్యేకమైన ప్రణాళికను ఆపార్టీ అమలు చేస్తున్నట్లు ఉపాధ్యాయవర్గాల్లో చర్చసాగుతోంది. మరోవైపున కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారికంగా ఎవరికీ మద్దతివ్వకపోవడంతో ఆపార్టీల సానుభూతిపరులైన ఓటర్లను ప్రసన్నం చేసుకునే క్రమంలో పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థులు ఆయాపార్టీలలో వారికున్న పరపతి, పరిచయాల ద్వారా ఉపాధ్యాయులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్న పరిస్థితి క్షేత్రస్థాయి వరకు కొనసాగుతోంది.

పగలు ఇళ్ల వద్ద రెక్కీ.. రాత్రివేళ చోరీలు

● కష్టపడడం ఇష్టం లేక దొంగలుగా మారిన భార్యాభర్తలు ● తెలుగురాష్ట్రాల్లో 47 దొంగతనం కేసులు ● చివరికి పోలీసులకు చిక్కిన వైనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐలు నాగార్జున, వీరబాబు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పగటివేళ తాళం వేసిన ఇళ్లపై రెక్కీ నిర్వహించి రాత్రివేళలో ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న భార్యాభర్తల పోలీసులకు చిక్కారు. కష్టపడి జీవించడానికి ఇష్టపడని వారు దొంగలు అవతారమెత్తారు. కొంతకాలంగా వరుసచోరీలకు పాల్పడి చివరికి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులకు చిక్కారు. టూటౌన్ సీఐ నాగార్జున, రూరల్ సీఐ వీరబాబు కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన వేముల కోటేష్, అతని భార్య కృష్ణవేణి 2010 నుంచి చోరీలకు పాల్పడుతున్నారు. ఇప్పటి వరకు వీరు తెలంగాణ, ఏపీ రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 47 దొంగతనాలు చేశారు. కేసులు నమోదై జైలుకు వెళ్లి వచ్చినా వారి ప్రవర్తన మారలేదు. 2024 మార్చి నెలలో మిర్యాలగూడ వన్‌టౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లలో నమోదైన రెండు చోరీ కేసుల్లో నిందితులుగా గుర్తించి పోలీసులు రిమాండ్‌కు పంపారు. 2024 జూలై నెలలో జైలునుంచి బయటకు వచ్చిన వీరు మళ్లీ చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుక తిరుగుతున్నారు. పగటివేళలో బస్సు, రైళ్లలో ప్రయాణించి తమకు తోచిన ప్రాంతల్లో తిరుగుతూ తాళం వేసిన ఇళ్ల వద్ద రెక్కీ నిర్వహించేవారు. రాత్రి పొద్దుపోయేంత వరకు సమీపంలో బస్టాండ్, రైల్వేస్టేషన్లలో నిద్రించి పథకం ప్రకారం ఇళ్లల్లో చొరబడి దొంగతనాలు చేసేవారు. తమ కులవృత్తైన వడ్డెర పనులకు వెళ్లగా వచ్చే కొద్దిపాటి ఆదాయంతో సాధారణ జీవనం సాగించడం ఇష్టంలేక చోరీమార్గాన్ని ఎంచుకున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, వాడపల్లి, హాలియా, నకిరేకల్, నార్కట్‌పల్లి, నల్లగొండ, సూర్యాపేట, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, గడ్డపల్లి, చౌటుప్పల్, భువనగిరి, గుర్రంపోడు, వలిగొండ, కట్టంగూర్, అచ్చంపేట, ఆదిభట్ల ప్రాంతాలతోపాటు ఏపీ రాష్ట్రంలోని రెంటచింతల, గురజాల ప్రాంతంలో జరిగిన చోరీల్లో ప్రమేయం ఉందని నిందితులు విచారణలో ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు హాలియా, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, నకిరేకల్, డిండి, దేవకొండ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. కోటేష్‌పై 37 కేసు, కృష్ణవేణిపై 10 కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ 47చోరీలకు పాల్పడిన వీరిని పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. సోమవారం తెల్లవారుజామున మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్‌నగర్ సమీపంలో ఎస్ రాంబాబు ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా తాము చేసిన నేరాలను ఒప్పుకున్నారు. అంతర్రాష్ట్ర దొంగలుగా మారిన భార్య, భర్తల నుంచి సుమారు రూ. 8.50లక్షల విలువైన 97.9 గ్రాముల బంగారు ఆభరణాలు, స్మార్ట్‌ఫోన్, రూ. 50వేల నగదు రికవరీచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పోలీసులకు చిక్కకుండా చోరీలకు పాల్పడుతూ తప్పించుక తిరుగుతున్న దొంగలను పట్టుకున్న సీఐలు నాగార్జున, వీరబాబు, ఎస్ఐ రాంబాబు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పీసీలు అక్బర్, రామకృష్ణలను డీఎస్పీ రాజశేఖర్‌రాజు అభినందించారు.

ఆర్టీసీ బలోపేతానికి సిబ్బంది కృషిచేయాలి



మాట్లాడుతున్న జాన్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి): ఉద్యోగుల్లో సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం కొణతం జాన్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం నిర్వహిస్తున్న పవర్ ట్రైనింగ్ క్లాసులను పరిశీలించారు. సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రహదారి భద్రత, ప్రయాణికులతో మమేకం, వ్యక్తిత్వ వికాసమనే అంశాలపై శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. రీజియన్ పరిధిలోని ఉద్యోగులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు ఆయా వివరాలను ఆన్‌లైన్లో పొందుపరుస్తున్నట్లు తెలిపారు. నల్లగొండ, సూర్యాపేట డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు ప్రవేశపెట్టనున్నామని, అందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిపారు. టికెట్ ఇష్యూయింగ్ మిషన్(టిమ్)లను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రామ్మోహనరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ భారతీభాయి పాల్గొన్నారు.

మహాశివరాత్రికి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

దేవరకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 మధ్యాహ్నం నుంచి 27వరకు దేవరకొండ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. దేవరకొండ నుంచి శ్రీశైలానికి పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.210 టిక్కెట్ ఉంటుందని పేర్కొన్నారు. బస్సుల్లో మహాలక్ష్మి పథకం రాష్ట్ర సరిహద్దు పాతాల గంగ వరకు వర్తిస్తుందని డీఎం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిలుకూరు, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): బస్సు, కారును ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై కవిత జూనియర్ కళాశాల వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఉన్న బైక్‌ను తప్పించబోయి హుజూర్‌నగర్-కోదాడ వైపు వెళ్తున్న కారును గట్టిగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

నేత్రపర్వంగా దేవతాహ్వానం, ధ్వజారోహణం



దేవతాహ్వానం పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం చరమూర్తులు కొలువైన ఆలయంలో ధ్వజరోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, యాగశాలలో కలశపూజలు, అగ్ని ప్రతిష్ట పర్వాలు శైవాగమ పద్ధతిలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో యాజ్ఞికస్వామి, పురోహిత బృందం వేద మంత్ర పఠనాలతో త్రిశూల పూజ, దేవతాహ్వాన, భేరి పూజలు చేపట్టి మహోత్సవ వైశిష్ట్యమైన ధ్వజరోహణ పర్వానికి తెర తీశారు. ఆల యంలో ధ్వజపటాన్ని అలంకరించి షోడశోపచార పూజలు నిర్వహించారు. ఆల యంలో ధ్వజపటాన్ని ప్రతిష్ఠింపజేసిన పురోహితులు లగ్నాష్టకాలు, చూర్ణికల పఠనాలు ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ ధ్వజారోహణ పర్వం నేత్ర పర్వంగా సాగింది. అనంతరం యాగశాలలో సోమకుంభ, పూర్ణకుంభాలకు ప్రత్యేక పూజలతో అగ్నిప్రతిష్ట చేశారు. ఉత్సవాలను శివాలయ ప్రధానర్చకులు గౌరిభట్ల నర్సింహరాములు, ఆస్థాన సిద్ధాంతి గౌరిభట్ల సత్యనారాయణశర్మ, పురోహిత, రుత్విక బృందం చేపట్టగా ఆలయ అనువంశికధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో ఏ. భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాపనవీన్‌కు మార్‌శర్మ, గజ్వెల్లి రమేష్‌బాబు, పర్యవేక్షకుడు దీరావత్ రామరావునాయక్ ఉన్నారు.

నేడు శివ కల్యాణోత్సవం

హరిహరాదుల క్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన యాదగిరిగుట్టపై వైభవంగా నిర్వహిస్తున్న శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పర్వతవర్థినీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

హరిహరులకు పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వర శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్ర రీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటికమూర్తికి అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు.

లక్ష్మీ సమేతుడికి లక్షపుష్పార్చన పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకొని లక్షపుష్పార్చన పూజలు వైభవంగా జరిగాయి. ప్రతీ ఏకాదశి పర్వదినం రోజున స్వామిని లక్ష పుష్పాలతో అర్చించడం ఆలయ సంప్ర దాయం. ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనో హరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. స్వామి, అమ్మవార్ల సహస్రనామాలను అర్చకబృందం, వేదపండితులు పఠిస్తూ వివిధ రకాల పూలతో లక్షపుష్పార్చన పూజలను ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. పాంచరాత్రాగమనరీతిలో లక్షపుష్పార్చన వైభవంగా పూజారులు నిర్వహించారు.

త్రివేణీ సంగమంలో మొక్కులు చెల్లించుకుని వస్తుండగా..

● ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లొస్తుండగా నల్లగొండ వాసులకు రోడ్డు ప్రమాదం ● యూపీలో డివైడర్‌కు ఢీకొట్టిన కారు, మహిళ మృతి, నలుగురికి గాయాలు

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ త్రివేణీ సంగమంలో మొక్కులు చెల్లించుకొని తిరుగు ప్రయాణమైన నల్లగొండ జిల్లాకు చెందిన కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఓ మహిళ మృతిచెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. నల్లగొండ పట్టణానికి చెందిన రాచకొండ చంద్రశే ఖర్ అతని భార్య కళావతి, గజ్జల నాగరాజు ఆయన భార్య నాగలక్ష్మీతోపాటు హైదరాబాద్‌కు చెందిన వారి బంధువులకు సంబంధించిన మరో కుటుంబానికి చెందిన ముగ్గురు కలిసి కారులో ఈ నెల 19వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌కు మహాకుంభమేళాకు వెళ్లారు. త్రివేణి సంగమంలో మొక్కులు చెల్లించుకున్న తర్వాత తిరిగి వీరు ప్రయాణమయ్యారు. రామమందిరాన్ని సందర్శించి తిరిగి నల్లగొండకు బయలు దేరారు. ఉత్తరప్రదేశ్‌లోని కట్నీ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు సోమవారం ఉదయం డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రాచకొండ కళావతి(45) అక్కడికక్కడే మృతిచెందింది. కారులో ఉన్న రాచకొండ చంద్రశేఖర్, గజ్జల నాగరాజుకు తీవ్రంగా గాయపడ్డారు. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికంగా ఓ ఆస్పత్రికి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

గుర్తుతెలియని వ్యక్తి



నల్లగొండ క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 23వ తేదీ(ఆదివారం) అర్ధరాత్రి సమయంలో నల్లగొండ మండలం దీపకుంట గ్రామ సమీపంలో ఉన్న పద్మావతి ఫంక్షన్‌హాల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సుమారు 30-35 ఏళ్ల వయస్సు కలిగిన యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని వివరాలు తెలియలేదని, మృతుని కుడి చేతిపై 'స్వరూప చెల్లి' అనే పచ్చబొట్టు రాసి ఉంది. మృతదేహాన్ని గుర్తించిన వారు నల్లగొండ రూరల్ ఎస్ఐ 8712670177, పోలీస్‌స్టేషన్ నెంబర్ 8712531330, 8712667677 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

లారీ ఢీకొని వ్యక్తి ..

దామరచర్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలోని వాడపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం శ్రీనగర్‌కు చెందిన లారీ డ్రైవర్ శంకరశెట్టి వెంకట చంద్రశేఖర్ రావు(38) ద్విచక్ర వాహనంపై శ్రీనగర్ నుంచి దామరచర్లకు వస్తుండగా అతి వేగంగా వస్తున్న లారీ వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటచంద్రశేఖర్‌రావు తల్లి బాలకోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త మృతిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): భర్త అకాల మృతిపై అనుమానంతో భార్య సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ కోడిరెక్క రమ్య తెలిపిన వివరాల ప్రకారం.. కోడిరెక్క సంపత్(32) పట్టణంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తూ వినోబానగర్‌లో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం రాత్రి 7గంటల సమయంలో సంపత్‌ను ఎండీ. గౌస్‌అలీ, రెడ్డిమాస్ యశ్వంత్, గురజాల బాలరాజు, పొదిళ్ల అన్వేష్ మద్యం సేవించేందుకు బయటకు తీసుకెళ్లినట్లు రమ్య ఫిర్యాదులో పేర్కొంది. అర్ధరాత్రి 12గంటలకు ఇంటికివచ్చిన తన భర్త రక్తవాంతులు చేసుకోవడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొంది. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపింది. ఆల్కహాల్‌లో కల్తీతో కాని, తన భర్తతోపాటు మద్యం సేవించేందుకు వెళ్లిన వారు విషప్రయోగం చేసి ఉంటారన్న అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా చిలకరాజు సతీష్ కుమార్, ప్రధానకార్యదర్శి గా కల్లూరి సత్యనారాయణ గౌడ్ నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్ లోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయములో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడుమేకపోతుల నరేందర్‌గౌడ్ నియమకపు ఉత్తర్వులను అందచేశారు.

ఆంధ్రజ్యోతి ****
నల్లగొండ
నకిరేకల్, మునుగోడు

కంఠ మహేశ్వర ఆలయ నిర్మాణానికి విరాళం

శాలిగౌరారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమల రాయినిగూడెం గ్రా మంలో నిర్మిస్తున్న కంఠమహేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఇటుకుల పహాడ్ గ్రా మానికి చెందిన చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ -జ్యోతి దంపతులు రూ.50 వేలు కమిటీ సభ్యులకు అందజేశారు. గౌడ సంఘం అధ్యక్షుడు కర్నాటి కృష్ణ, బండారు యాదయ్య, వడ్లకొండ బీక్షం, వడ్లకొండ రవి, నాగయ్య, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు స్వాగతం



పెర్కకొండారం వద్ద అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

శాలిగౌరారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ వెళ్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మండలం పెర్కకొండారం జాతీయ రహదారి వద్ద బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఆమె వెంటనే కారు దిగి అందరికి అభివాదం చేశారు. కవితను కలిసిన వారిలో శాలిగౌరారం మండలం బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు కట్ట వెంకట్‌రెడ్డి, నాయకులు దుబ్బ వెంకన్న, మాచర్ల అంజయ్య, యామగాని వెంకన్న, సైదులు, అంజయ్య ఉన్నారు.

వైభవంగా గంగదేవమ్మ పండుగ



కొర్లపహాడ్‌లో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో సోమవారం యాదవుల ఆరాధ్య దైవం గంగదేవమ్మ పండగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు అందంగా అలంకరించిన బోనాలను నెత్తికెత్తుకుని డప్పు వాయిద్యాలతో ప్రదర్శనగా ఆలయం వద్దకు వెళ్ళి, అమ్మవారికి బోనాలను సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగుండాలని తమ ఆరాధ్య దైవాన్ని మొక్కుకున్నారు. కోరిన కోర్కెలు తీరిన వారు మేకలు, గొర్రె పొటేళ్లను అమ్మవారికి బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, గ్రామ మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు ఎడ్ల పార్వతమ్మ, ఎడ్ల సంధ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకటరెడ్డి, వివిధ పార్టీల నాయకులు జి.మాధవరెడ్డి, ప్రవీణ్, రమేష్, బి.శ్రీనివాసయాదవ్, యాదగిరి, సైదిరెడ్డి, సీహెచ్.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ భానుదేవేందర్

మర్రిగూడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలల్లో రాణించి స్వయం సమృద్ధి పొందాలని స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ బాను దేవేందర్, టీఎఫ్ఎల్ కోఆర్డినేటర్ ఎస్. ప్రభాకర్ అన్నారు. మహిళలకు పొదుపుపై మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఫర్ ఫైనాన్షియల్ లిటరేచర్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని పొదుపు బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ తులసీ రావు, పద్మ, ఎస్‌కె.ఫరానా తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న అధికారులు

కట్టంగూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తెల్సూరి జయసుధ, ప్రధాన కార్యదర్శిగా మన్నెం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా సాయికృష్ణ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీవో చింతమల్లి చలపతి, కార్యదర్శులు వడ్లకొండ అశోక్, శ్రీకాంత్‌రెడ్డి, కన్నెబోయిన పెద్దయ్య, సరస్వతి, శ్రీను, సురేష్ తదితరులు ఉన్నారు.

ఏబీవీపీ ఎంజీయూ కార్యవర్గం ఎన్నిక

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రాగిఫణి హనుమాన్, మోహన్ సాయి ఎన్నికయ్యా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో నెలకొన్న విద్యారంగా సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. విద్యార్థుల శ్రేయస్సు కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



రాగిఫణి, మోహన్

ఏబీవీపీ ఉపాధ్యక్షుడిగా సూర్య

చిట్యాల: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఏబీవీపీ ఉపాధ్యాక్షుడిగా చిట్యాలకు చెందిన కొంపెల్లి సూర్య నియమితులయ్యారు. ఈ మేరకు ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

చిట్యాల, ఫిబ్రవరి24, (ఆంధ్రజ్యోతి): చిట్యాలలోని ఆయూబ్‌నగర్ కాలనీకి చెందిన కుల్సూంబీ కూతురు వివాహం సోమవారం చిట్యాలలో జరిగింది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడు కోనేటి ఎల్లయ్య 5వేల రూపాయల ఆర్థిక సహయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జిట్ట బొందయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

● *అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్*

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధి కారులతో ప్రజావాణి ఫిర్యాదులను సమీక్షిస్తూ ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని, దానివల్ల ఫిర్యాదుదారులకు తక్షణ సహాయం అందుతుందని అన్నారు. ముఖ్యంగా వెంటనే పరిష్కారమయ్యే వాటికి తక్షణ పరిష్కారం చూపించాలని, పై స్థాయిలో పరిష్కారం అయ్యే వాటికి విషయాన్ని ఫిర్యాదుదారుకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు. అలాగే మండల గ్రామ స్థాయిలో సైతం ప్రజావాణి ఫిర్యాదులను పరి ష్కరిస్తే జిల్లాలోని పేద ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. కాగా ఈ సోమవారం 67 మంది ఫిర్యాదుదారులు వారి ఫిర్యాదులను అదనపు కలెక్టర్, జిల్లా అధికారులకు సమర్పించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్ఓ వై. అశోక్ రెడ్డి,డీఆర్‌డీవో శేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మునుగోడు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరటికల్ గ్రామంలో లక్ష్మీనారా యణ స్వామి సహిత లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగు తున్నా యి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీనరసింహస్వామి, గోదా రంగ నాయకస్వామి వార్ల తిరుకల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు శ్రీమాన్ ముదివర్తి రాఘవ చార్యులు, బొల్ల వెంకటేశం, వై.శ్రీనివాస్ శర్మ నిర్వహించారు. ఈమహోత్సవానికి గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి తలంబ్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణం అనంతరం యా దాద్రి ఆలయ అర్చకులు నర సింహచారి చెప్పిన ప్రవచనాలను భక్తులు శ్రద్ధతో విని స్వామి వారి సేవలో తరించారు.

చెరువులు నింపేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి

మునుగోడు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్ట్ నీటిని మళ్లించి మునుగోడు మం డలంలోని చెరువులను నింపేందుకు స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చొరవ చూపాలని అక్షర ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు కోడి రాములు విజ్ఞప్తి చేశారు. స్థానికంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. మునుగోడు ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో వనరులు ఉండి కూడా అభివృద్ధిలో వెనుకబాటులో ఉం దని తెలిపారు. ఇలాంటి పరిస్థితులను అధిగ మించేందుకు సాగునీటిని పారించేందుకు శ్రద్ధ చూపాలని అందులో ప్రధానంగా బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్ట్ ద్వారా చిట్యాల మండలం ఎలికట్టె ఉరుమడ్ల మీదుగా మండల పరిధిలోని కిష్టాపురం పెద్ద చెరువును ప్రధాన కాల్వల ద్వారా నింపాలన్నారు. అక్కడ నుంచి దిగువన గల తాళ్లవెల్లెంల, ఊకొండి, రత్తిపల్లి, పులిపలుపుల, కల్వలపల్లితో పాటు కచలాపురం, సింగారం, మునుగోడు, గూడాపూర్ చెరువులకు కాల్వల ద్వారా నీటిని మళ్లిస్తే పూర్తి కరవు తీరనుందని స్పష్టం చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

మృతుల కుటుంబాలకు గుత్తా అమిత్‌రెడ్డి చేయూత



చిట్యాల మండలం ఉరుమడ్లలో ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన పలువురు మృతిచెందగా వారి కుటుంబాలకు గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు చైర్మన్, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి రూ. 70వేల అందజేశారు. గ్రామానికి చెందిన పాకాల నరేష్, జన్నపాల చిన్నముత్తమ్మ, మర్రి రాములమ్మ, అంతటి చంద్రయ్య, దోటి మల్లమ్మ, బిస్మిల్లాబీలు ఇటీవల మృతిచెందారు. ఆయా కుటుంబాలకు గుత్తా అమిత్‌రెడ్డి సానుభూతి తెలియజేసి ట్రస్టు ద్వారా రూ. 70వేల ఆర్థిక సహాయాన్ని పంపించారు. నరేష్ కుటుంబానికి రూ. 20వేలు, చినముత్తమ్మ కుటుంబానికి రూ. 10వేలు, రాములమ్మ కుటుంబానికి రూ. 10వేలు, చంద్రయ్య కుటుంబానికి రూ. 10వేలు, మల్లమ్మ కుటుంబానికి రూ. 10వేలు, బిస్మిల్లాబీ కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ నాయకులు కోనేటి యాదగిరి, పోలగోని స్వామి, పల్లపు బుద్ధుడు బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో పట్ల జనార్ధన్, జన్నపాల శ్రీను, కురుపటి లింగయ్య, పాకాల దినేష్, మర్రి రమేష్, నడింపల్లి గోపాల్, వెలిమినేటి హరిప్రసాద్, మేడబోయిన శ్రీను, ఉయ్యాల నరేష్, నడింపల్లి నర్సింహ, అనంతుల శంకర్, మందుగుల కుమార్, జనపాల జానయ్య, కోరబోయిన లక్ష్మయ్య పాల్గొన్నారు.

పెద్దకాపర్తిలో...

అదేవిధంగా మండలంలోని పెద్దకాపర్తికి చెందిన చూపూరి బాబూరావు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో చదువుకున్న 10వత తరగతి పూర్వవిద్యార్థులు ఎల్. శ్రీను, జి. పురుషోత్తం, కె. వెంకటేశం, ఎ. శ్రీనివాస్ రూ. 30వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఎస్టీ గురుకులంలో రాజ్యాంగ ప్రతికి చోటేదీ..!

● *సర్క్యులర్ రాలేదంటున్న కొందరు ప్రిన్సిపాల్స్* ● *కొన్ని గురుకులాల లైబ్రరీల్లో ఉన్న రాజ్యాంగం పుస్తకాలు*

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి) : ఎస్టీ గురుకులాల్లో రాజ్యాంగ ప్రతిని ప్రదర్శించాలన్న ప్రభుత్వ పెద్దల ఆదేశాలు అమల్లో ఆచరించడంలేదు. రాజ్యాంగంపై ప్రతీ విద్యార్థికి అవగాహన ఉండాలన్న ఆశయంతో గురుకులాల్లో రాజ్యాంగ ప్రతిని ఏర్పాటు చేయాలని పాలకుల ఆదేశాలు అమలు కావడం లేదని తెలుస్తోంది. ఎస్టీ గురుకులాల్లో విధిగా రాజ్యాంగ ప్రతిని ప్రదర్శించాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క గతేడాది ఆదేశాలు జారీ చేశారు. అయితే కట్టంగూర్ మండలం అయిటిపాములలో మాత్రమే గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాల ఉన్నది. రాజ్యాంగ ప్రతిని గురుకులంలో ఏర్పాటు చేశారా అని ఆ పాఠశాల ప్రిన్సిపల్‌ను ప్రశ్నిస్తే తమకు ఆ విషయంపై అధికారికంగా ఎలాంటి సర్క్యులర్ రాలేదని చెప్పారు. గతంలో తాను జడ్పీ ఉన్నత పాఠశాలలో గణితం మాస్టారుగా పనిచేశానన్నారు. ఆదేశాలు అందకపోయినా రాజ్యాంగం మీద గౌరవంతో విద్యార్థుల అవగాహన కోసం ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర కులాల గురుకులాల్లో కొన్నింటిలో మాత్రం రాజ్యాంగం పుస్తకాన్ని లైబ్రరీలో అందుబాటులో ఉంచారు. సదరు గురుకుల సొసైటీ గతంలోనే ఆయా గురుకులాలకు రాజ్యాంగం పుస్తకాలను అందజేసిందని చెప్పారు. రాజ్యాంగంపై 9,10వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశాలు ఉన్నాయని వాటిని బోధిస్తున్నామని చెబుతున్నారు. పాఠాలతో పాటు రాజ్యాంగం పుస్తకంలోని పలు ప్రధాన అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి



డిండి సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహరెడ్డి

డిండి, ఫిబ్రవరి 24(ఆంధ్ర జ్యోతి): త్వరలో జరుగబోయే స్థానిక సంస్థలకు ఎన్నికలకు నాయ కులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాల యంలో నిర్వహించిన పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పార్టీ శ్రేణులు గ్రామాల్లో నూతన శాఖలు ఏర్పాటు చేయా లని ఎన్నికలకు కార్యకర్తలను సంసిద్ధంగా చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో వెంకటరమణ, బుచ్చిరెడ్డి, ఎస్ఆర్. కనక చారి, ఎండీ.మైనొద్దీన్, శైలాజ్, విజేందర్‌రెడ్డి, రవీందర్ శర్మ, కేశవులు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

చెర్వుగట్టులో ఎంపీ చామల పూజలు



చెర్వుగట్టు క్షేత్రానికి ఎంపీగా తొలిసారి విచ్చేసిన చామలకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలు సోమవారం సందర్శించారు. ఎంపీగా గెలిచిన అనంతరం మొదటిసారిగా దేవస్థానానికి వచ్చిన ఎంపీకి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రధానాలయం మూలవిరాట్టు వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలను ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వీరేశంతో చర్చించి దేవస్థాన అభివృద్ధికి స్థానిక ఎంపీగా తన వంతు కృషి చేస్తానన్నారు. భక్తుల కోరిక మేరకు గిరిప్రదక్షిణ అవకాశాలను పరిశీలిస్తామన్నారు. శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని దేవస్థానం అధికారులకు ఎంపీ సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు పాశం శ్రీనివాస్ రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, నేతకాని కృష్ణయ్య, నల్ల వెంకన్న, వడ్డే భూపాల్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, గడుసు శశిధర్‌రెడ్డి, సట్టు సత్తయ్య, రేగట్టె నవీన్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, వేముల నర్సింహ్మ, సత్తయ్య, గడ్డం పశుపతి, దాసరి రాజు, దొండ రమేశ్, బింగి మహేశ్, శ్రీకాంత్, పల్లె నరేందర్ రెడ్డి, ప్రజ్ఞాపురం సత్తి తదితరులు ఉన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలని పోస్టు కార్డుల ద్వారా వినతి



తెలంగాణ తల్లి విగ్రహానికి పోస్టు కార్డులు అందజేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరుతూ పోస్టు కార్డులు రాసి స్థానిక ఎన్జీ కళాశాల ఎదురుగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని లేకుంటే అతి త్వరలోనే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూరిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుందని, విద్యార్థులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబటి ప్రణీత్, చే దుబుద్ది రాంబాబు, కందుల సంపత్, పాక సాయి, రాజు, రాకేష్, వెంకన్న తదితరులు ఉన్నారు.

ఎండిన పంట పొలాల పరిశీలన



పంట పొలాన్ని పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న డీఈ

కట్టంగూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునుకుంట్ల గ్రామానికి చెందిన భీమనబోయిన చెందిన ఎండిపోయిన పంట పొలాలను గేదెలకు, మేకలకు వదలి పెట్టిన విషయమై వివిధ పత్రికలల్లో సోమవారం ప్రచురితమైంది. దీంతో ట్రాన్స్‌కో డీఈ అన్న య్య సోమవారం బాధిత రైతు పంట పొలాన్ని పరిశీలించాడు. కరెంట్ కోత వల్ల పంట పొలా లు ఎండిపోలేదని సంబంధిత రైతు బోరులో భూగర్భ జలాలు అడుగంటడం వల్ల పొలాలు ఎండిపోయాయని తన పరిశీలనలో వెల్లడి అయిందన్నారు. రైతులకు వ్యవసాయ బావులకు 24గంటల కరెంట్ అందిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఏడీ సురేష్, ఏఈ హుస్సేన్ ఉన్నారు.

పురాతన శివాలయంలో శివలింగం, వెండి కన్ను



శివాలయంలో బయటపడిన శివలింగం. వెండి కన్ను.


చండూరు రూరల్, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చామలపల్లి గ్రామ పురాతన శివాలయాన్ని గ్రామస్థులు అంతా కలిసి పునః నిర్మించాలని తలచారు. దీంతో ఈ నెల 26 మహా శివరాత్రి రోజు కోసం ఆలయ పరిసరాలను, గర్భగుడిని శుభ్రం చేస్తుండగా అందులో శివ లింగం, స్వామి వారి వెండి కన్ను బయటపడ్డాయి. ఈనేపథ్యంలో గ్రామస్థులు మాట్లాడుతూ ఎన్నో తరాలుగా ఇక్కడి శివాలయం శిథిలావస్థలో ఉన్నదని, ఆ దేవదేవుడు ఇక్కడే కొలువై ఉన్నాడనడానికి ఇవే సాక్ష్యాలు అని సంతోషం వ్యక్తం చేశారు. దేవాదాయశాఖ అధికారులు, పురావస్తుశాఖ అధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆలయ పునఃనిర్మాణానికి సహకరించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు అడవి మారయ్య, కాటం దేవేందర్, ముదిగొండ అంజనేయులు, పెందోట వెంటకయ్య, పెందోట ఈదయ్య, ముంత వెంకటేశ్వర్లు, యాదయ్య, నర్సింహ, గుండెల వెంకన్న, శ్రవణ్, గ్రామస్థులు తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మండలంలోని జాల్‌తండాలో సోమవారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించుకోవడం మం చి విషయమన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని కలిగి ఉండాలన్నారు. గ్రామా భివృద్ధికి తనవంతుగా తోడ్పాటునందిస్తానన్నారు. అనంతరం గ్రామస్థులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మునినాయక్, స్వామినాయక్, పంతు నాయక్, శ్రవణ్‌నాయక్, కుమార్‌నాయక్‌పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

హాలియా, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): హాలియాలోని కేజీబీవీ పాఠశాలలో బేటీ బచావో... బేటీ పడావో సోమవారం సీడీపీవో ఉదయశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలకు బాల్య వివాహాలు, బాలకార్మికులు, బాలిక విధంగా ప్రాముఖ్యత, సంక్రమిత వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అలాగే హైదరాబాద్ గుడ్ యూనివర్స్ ఎన్‌జీవో నీలోఫర్, టీం వారు పాఠశాలలోని 292 మంది కిశోర బాలికలకు హెల్త్ ఎడ్యుకేషన్, పర్సనల్ హైజీన్, పోషకారంపై అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలకు శానిటరీ యూస్‌బుల్ నాప్‌కిన్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ,హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 19.4

శైవక్షేత్రాల వైశిష్ట్యం

- భక్తుల కొంగు బంగారంగా కాకతీయుల కాలం గొప్ప ఆలయాలు
- మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైన శైవ క్షేత్రాలు



జిల్లాలోని శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబు చేశారు. బీబీనగర్, యాదగిరిగుట్టలో ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఒక్కోచోట ఒక్కో పేరుతో ఆ శివుడిని పూజిస్తున్నారు. ఒక చోట రామలింగేశ్వరుడిగా, మరోచోట పచ్చల సోమేశ్వరుడిగా, మరోచోట శివుడిగా.. ఇలా ఆ పరమ శివుడికి పూజలు చేస్తున్నారు. ఆ ఆలయాల విశేషాలు 6వ పేజీలో..

నేత్రపర్వంగా ధ్వజారోహణం

యాదగిరిగుట్టలో వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు



దేవతాహ్వానం పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


7

పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలి

డీపీవో వెంకయ్య

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని డీపీవో వెంకయ్య అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రజలనుంచి ఇంటి పన్నులు వసూలు చేయాలని, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా నర్సరీల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించాలని, వేసవిలో ఎండకారణంగా చెట్లు ఎండిపోతే కొత్త మొక్కలు నాటి ఎదిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంగీత, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

హాలియా, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులు కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డులో కంది కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన కందులను మార్కెట్‌కు తీసుకొచ్చి మద్దతు ధర క్వింటాకు రూ.7,550 పొందాలన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఎఫ్ఏక్యూ నిబంధనలు అనుసరంగా కందిని తీసుకొని వచ్చి కొనుగోలు కేంద్రానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాక్స్ సీఈవో సత్యం, జానకిరాములు, వ్యవసాయాధికారులు, మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి మంగళవారం సాయంత్రంతో గడువు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో చివరిదశలో ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులు ఎవరికి వారు గెలుపు ధీమాతో ప్రచారంలో దూసుకెళుతుంటే, ఉపాధ్యాయ సంఘాలు తాము మద్దతిచ్చిన అభ్యర్థుల విజయంకోసం శ్రమిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- టీచర్లతో వ్యక్తిగతంగా అనుసంధానానికి ప్రాధాన్యమిచ్చిన అభ్యర్థులు
- సోషల్‌మీడియాలో విస్తృతస్థాయి ప్రచారం
- తటస్థ, సైలెంట్ ఓటర్లపైనే ఎక్కువ దృష్టి
- నేటి సాయంత్రం నుంచి ఎన్నిక పూర్తయ్యే వరకూ సైలెన్స్ పీరియడ్ : కలెక్టర్





1.నర్సిరెడ్డి
2.పులి సరోత్తమ్‌రెడ్డి,
3.సుందర్‌రాజ్ యాదవ్
4.గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి
5.పూల రవీందర్

నేటితో ప్రచారానికి తెర

సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఎన్నికలప్రచారం సాగుతోంది. గెలుపే లక్ష్యంగా ప్రధాన అభ్యర్థులు దూకుడు పెంచారు. చివరిదశలో ఉపాధ్యాయ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరంచేశారు. బుధవారం సాయంత్రం నుంచి ఎస్ఎంఎస్‌లు సైతం పెట్టకుండా ఎన్నికల సంఘం నిషేధం విధించడంతో ఈలోపే ప్రతి ఉపాధ్యాయుడికీ తమ అభ్యర్థన వెళ్లేలా బరిలో నిలిచిన అభ్యర్థులు ఏర్పాట్లుచేసుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి టీఎస్ యూటీఎఫ్ నుంచి బరిలో ఉండగా, పీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్టీయూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ-టీఎస్ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ నుంచి పులి సరోత్తమ్‌రెడ్డి, బీసీ సంఘాల మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సుందర్‌రాజ్ యాదవ్ సహా మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ స్థానంలో గెలవడం ద్వారా ఉపాధ్యాయ వర్గాల్లో తమ ఆధిక్యతను చాటేందుకు ఉధృతంగా ప్రచారం సాగించారు.

ప్రతి ఉపాధ్యాయుడికీ సందేశం చేరడమే లక్ష్యం

ఈ నియోజకవర్గంలో భిన్న తరహాలో ప్రచారం కొనసాగింది. ఉపాధ్యాయుల సమ్మేళనాలు, సమావేశాలతోపాటు అభ్యర్థులు నేరుగా ఓటర్లతో అనుసంధానమవుతూ తమకు ఓటేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఉపాధ్యాయ సంఘాల ద్వారా, సమావేశాల ద్వారా ఓట్లను అభ్యర్థిస్తూనే మరోవైపు సంఘాలకు అతీతంగా ఉపాధ్యాయులతో టెలీ కాన్ఫరెన్సులు, గ్రూప్ కాల్స్ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఉపాధ్యాయ నేతగా ఇప్పటివరకు తాము చేసిన పోరాటాలు, కృషిని గుర్తుచేయడంతోపాటు, ప్రస్తుతం నెలకొన్న ఉపాధ్యాయ సమస్యలు, సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగంలో వచ్చిన మార్పులు, వ్యవస్థ బలోపేతానికి తాము చేపట్టబోయే కార్యాచరణను వివరించారు. సంఘాలు ఏవైనా ఆయా ఉపాధ్యాయులతో తమకున్న సంబంధాలను గుర్తుచేస్తూ సెంటిమెంట్‌ని సైతం పండించారు. తమవాదాన్ని, సిద్ధాంతాన్ని తెలియజేస్తూ తమకే ఓటేయాలంటూ అభ్యర్థించారు. ప్రధాన అభ్యర్థులంతా ఈ తరహాలో ప్రతీ ఉపాధ్యాయ ఓటరుకి తమ గళం వినిపించేలా, కనీసం ఒక్కసారైనా వారిని నేరుగా ఓటు అభ్యర్థించేలా ఈసారి ప్రచారవ్యూహం అమలు చేశారు.



సోషల్ మీడియాలో హోరెత్తిన ప్రచారం

నియోజకవర్గం పరిధి విస్తృతంగా ఉండడంతో అభ్యర్థులంతా సోషల్ మీడియాను ప్రచారంలో విస్తృతంగా వినియోగించుకున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌వేదికలుగా ఉధృతస్థాయిలో తమగళం వినిపించారు. తమకు ఓటేస్తే...

- మిగతా 7వ పేజీలో...

48 గంటలపాటు సైలెన్స్ పీరియడ్ : కలెక్టర్



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగనున్న నేపథ్యంలో 48గంటల సైలెన్స్ పీరియడ్ అమల్లో ఉంటుందని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు బహిరంగసభలు, సమావేశాలు, ఊరేగింపులు, ప్రచారాలు, రాజకీయపరమైన, అభ్యంతరకరమైన కంటెంట్‌తో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం కొనసాగుతుందన్నారు. సోషల్‌మీడియాపైనా నిశితమైన పరిశీలన కొనసాగుతుందని, సైలెన్స్ పీరియడ్‌లో నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే ఎన్నికల ప్రవర్తనానియామావళి ననుసరించి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సైలెన్స్ పీరియడ్‌లో జిల్లాయేతర వ్యక్తులెవరు జిల్లాలో ఉండవద్దని హెచ్చరించారు. అదేవిధంగా సైలెన్స్ పీరియడ్‌లో నియోజకవర్గమంతా, ఓట్లలెక్కింపు నిర్వహించే మార్చి 3వ తేదీన లెక్కింపు పూర్తయ్యేంతవరకు నల్లగొండ మున్సిపల్ పరిధిలో మద్యనిషేధం కూడా అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేంతవరకు జిల్లాలో 144వ సెక్షన్ సైతం అమల్లో ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు.

జిల్లా	పోలింగ్‌స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	మొత్తం
నల్లగొండ	37	2817	1866	4683
సూర్యాపేట	23	1702	962	2664
యాదాద్రి	17	638	346	984
సిద్దిపేట	4	123	43	166
జనగాం	12	614	388	1002
హనుమకొండ	15	2943	2272	5215
వరంగల్	13	1474	878	2352
మహబూబాబాద్	16	1112	551	1663
జె.భూపాలపల్లి	7	215	114	329
ములుగు	9	405	223	628
భద్రాద్రి	23	1068	954	2022
ఖమ్మం	24	2372	1717	4089
మొత్తం	200	15483	10314	25797

బాధితులను రక్షించేందుకు కృషి

మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



శ్రీశైలం సొరంగమార్గం వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి జానారెడ్డి, చిత్రంలో దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు బాలునాయక్, జైవీర్‌రెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సొరంగమార్గం ఇన్‌లెట్ దోమలపెంట వద్ద సొరంగంలో చిక్కుకున్న ఎనిమిదిమందిని కాపాడేందుకు ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ, నాగార్జునసాగర్, అచ్చంపేట ఎమ్మెల్యేలు బాలునాయక్, జైవీర్‌రెడ్డి, వంశీకృష్ణలతో కలిసి సొరంగమార్గాన్ని సందర్శించి మాట్లాడారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాడేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిక్కుకున్న వారిని కాపాడేందుకు కేంద్ర బలగాలు, సైనికులు, సింగరేణి రెస్క్యూటీం, హైడ్రా సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సంఘటన జరిగిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు సొరంగ మార్గం వద్ద ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మహాసభలో మాట్లాడుతున్న జనరల్ సెక్రటరీ పీయూ ఖడ్సే

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం ఆర్-3 జనరల్ సెక్రటరీ పీయూ ఖడ్సే అన్నారు. సోమవారం నల్లగొండలోని ఎలిమినేటి మాధవరెడ్డి పోలీస్ ఆడిటోరియంలో రిసెప్షన్ కమిటీ చైర్మన్, ఏఐపీఆర్‌పీఏ తెలంగాణ సర్కిల్ అధ్యక్షుడు సీహెచ్‌వీ రామారావు, సెప్షన్ కమిటీ జనరల్ సెక్రటరీ మోహన్ నేనావత్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న తెలంగాణ పోస్టల్ ఉద్యోగుల ద్వైవార్షిక మహాసభ(ఆలిండియా ఆర్ఎంఎస్ అండ్ ఎంఎంఎస్ ఎంప్లాయిస్ యూనియన్ గ్రూప్ సీ అండ్ మెయిల్ గార్డ్స్ అండ్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (గ్రూప్ సీ)కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 8వ పే కమిషన్‌లో లెవల్ 5 కావాలని తీర్మానం చేశారు. ఇంటిగ్రేటెడ్ మెయిల్ యూనియన్ కార్యాలయం గోల్కొండకు తరలిపోకుండా జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు.

అదే విధంగా ఎల్ 2 కార్యాలయాలను మూసివేయవద్దని అన్నారు. మంగళవారం జరిగే ముగింపు సభకు ముఖ్య అతిథిగా ఆర్ 4 మాజీ జనరల్ సెక్రటరీ పి.సురేష్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ ముక్తార్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ సీఎన్ నాయుడు, మాజీ సర్కిల్ సెక్రటరీ ఎం.నాగవర్ధన్‌రావు, జీఆర్ రెడ్డి, సర్కిల్ సెక్రటరీ ఎం.ముతేష్ , సీహెచ్‌వీ. రామారావు, మోహన్ నేనావత్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగే ఇంటర్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన తన చాంబర్లో ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ విషయమై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వరకు పదో తరగతి పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుండగా, పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30వరకు జరుగుతాయన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి దస్రు నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

గురుకులంలో అదనపు కలెక్టర్ రాత్రిబస

నిడమనూరు: నిడమనూరు మండలం వేంపాడ్ సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులతో కలిసి రాత్రిబస చేశారు. గురుకులాల పర్యవేక్షణలో భాగంగా ఆయన పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంది, విద్యా బోధన ఎలా ఉందని విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో కలిసి రాత్రి భోజనం చేసి గురుకులంలోనే నిద్రించారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీవో కేదారినాథ్, ఆర్ఐ దాడి రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, గంగుల లింగయ్య, గురుకులం ప్రిన్సిపాల్ చింతమళ్ల రాంబాబు ఉన్నారు.

రిటైర్‌మెంట్ ప్రయోజనాలు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం



నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) ఉద్యోగులకు రిటైర్‌మెంట్ ప్రయోజనాలు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఉందని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్లగొండలో పర్యటించిన ఆయన జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోర్టును ఆశ్రయించి తమకు రావాల్సిన ప్రయోజనా లను ఉద్యోగులు పొందాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గత సీఎం కేసీఆర్ రూ. 7లక్షల కోట్లు అప్పు చేశారని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి తీసుకువెళ్లారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరోత్తమ్‌రెడ్డిని గెలిపించాలన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డి, బీజేపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి రాష్ట్ర, జిల్లా నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, శానంపూడి సైదిరెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవి, పిల్లి రామరాజు, విజయారెడ్డి, శ్రీలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టుపై అసలేం జరుగుతోంది ?

ఆర్డీవో ఆకస్మిక తనిఖీతో సిబ్బందిలోనూ చర్చ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అసలేం జరుగుతోందనే చర్చ మొదలైంది. నల్లగొండ ఆర్డీవో రెండు సార్లు ఆకస్మిక తనిఖీ చేయడంతో పాటు మళ్లీ వస్తానని రికార్డులు తనిఖీ చేస్తానని చేసిన ప్రకటనతో ఈ చర్చ మరింత పెరిగింది. దేవస్థానంలో ఇటీవల పూర్తయిన ఉత్సవాల ఏర్పాట్ల నిమిత్తం నిర్వహించిన సన్నాహక సమావేశం రోజునే కొందరు కలెక్టర్‌కు పలు అంశాలపై ఫిర్యాదు చేయగా దాని పర్యవసానమే ఆర్డీవో రికార్డుల తనిఖీ చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో ప్రధానంగా వివిధ టెండర్ల నిర్వహణ... బకాయిల పైనే ప్రధానంగా ఫిర్యాదులు వచ్చేవి. ఇపుడు ప్రతీ విభాగానికి సంబంధించి క్షుణ్ణంగా ఆర్డీవో రికార్డులు పరిశీలించడం వెనుక అసలు మతలబు ఏమిటనేది ప్రశ్నగా మారింది. దేవస్థానంలో నిర్వహించిన కొన్ని టెండర్లు ఒకే వ్యక్తికి రావడంపై కూడా ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. సివిల్ కాంట్రాక్టర్ లైసెన్సు ఉన్న వ్యక్తికి జాతర లైటింగ్ కాంట్రాక్ట్ ఎలా ఇస్తారంటూ టెండరు వేసిన పోటీదారుల్లో అర్హత గల ఓ టెండరు దారుడు ప్రశ్నించి పై అధికారులకు కూడా మౌఖికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

అప్పుడు డీఆర్‌డీఏ పీడీ: గతంలో కలెక్టర్‌గా నారాయణరెడ్డి ఉన్నప్పుడు కూడా ఇదే రకమైన ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో చెర్వుగట్టు క్షేత్రంపై దృష్టి పెట్టిన నారాయణరెడ్డి డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డికి చెర్వుగట్టు పర్యవేక్షణ బాధ్యతలకు సంబంధించి మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆయన ఆలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి దేవస్థాన నిర్వహణ లోపాలను గుర్తించారు. రెండు పర్యాయాలు ప్రత్యేకంగా ఆలయాన్ని సందర్శించి దేవస్థాన పాలనా వ్యవహారాల్లో కొంత మార్పులను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుండగానే ఆయన అనారోగ్యానికి గురయ్యారు. దీనికి తోడు కలెక్టర్ నారాయణరెడ్డి కూడా రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.



రికార్డుల అసంపూర్తిపై చెర్వుగట్టు దేవస్థానం ఈవోను ప్రశ్నిస్తున్న ఆర్డీవో

ఇప్పుడు ఆర్డీవో: ప్రస్తుతం దేవస్థానంలో పాలన గాడితప్పి అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో గత కలెక్టర్ నారాయణరెడ్డి మాదిరిగానే ప్రస్తుత కలెక్టర్ ఇలా త్రిపాఠి కూడా ఆర్డీవోను పంపి రికార్డులను తనిఖీ చేయాలని ఆదేశించింది. రెగ్యులర్ సిబ్బంది తక్కువగా ఉండటంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకున్నారు. ఈ విషయంలో కూడా కొన్ని ఆరోపణలు అధికారులకు చేరాయి. దీంతో రికార్డుల తనిఖీ సమయంలో తన దృష్టికి వచ్చిన రికార్డుల నిర్వహణ తీరును ఆర్డీవో నోట్ చేసుకున్నారు. కింది స్థాయి సిబ్బంది తప్పు చేస్తే ఆ తప్పుకు బాధ్యత వహించాల్సి వస్తుందన్న విషయం తెలియదా అంటూ ఆర్డీవో వ్యాఖ్యానించడంపై ఏం జరుగుతుందోనన్న ఆందోళన దేవస్థాన సిబ్బందిలో నెలకొంది.

తక్కళ్లపల్లిలో ముగిసిన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

చింతపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో రెండు రోజులుగా కొనసాగుతున్న సీతారామ ఆంజ నేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముద్దం సత్తమ్మా మారయ్య గౌడ్, ముద్దం రవీందర్ గౌడ్, అంకం చంద్రశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి : కమిషనర్

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్ తెలిపారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆస్తి, నీటి పన్ను వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, కొత్తగా నియమించబడిన వార్డు ఆఫీసర్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు స్వచ్ఛసర్వేక్షణ్ నిర్వహణకు మునిసిపాలిటీకి రూ.40 లక్షలు వచ్చినట్లు తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక హజరత్ దర్గా



పీకేమల్లేపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రాంరెడ్డి

చింతపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా హజరత్ దర్గా అని రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. మండలంలోని పీ.కే.మల్లేపల్లిలో హజరత్ అబ్బాస్ దర్గాలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ-ముస్లిం ల తేడా లేకుండా భక్తి శ్రద్ధలతో ఉర్సు జరుపుకోవడం అభినందనీయమన్నారు. దర్గా అభివృద్ధి కోసం తన వంతుగా నిధులు కేటాయించి పనులు నిర్వహి స్తామ న్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మద్ద రాంమోహన్ గౌడ్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహిపాల్ రెడ్డి, మహేష్‌గౌడ్, ఎండీగౌస్, రాఘవేందర్, ఫిరోజ్, అమీర్, ముత్తవలీ ఎండీ.చాంద్‌పాషా, దర్గా కమిటీ చైర్మన్ కేవీ. రమేష్ రాజు, సయ్యద్‌పాషా, ఎండీ.యుసుఫ్‌పాషా, షరీఫ్, పాల్గొన్నారు.

నేటి నుంచి మదార్ సాహెబ్ ఉర్సు

చింతపల్లి మండలం గొడుకొండ్ల(వీ.టీనగర్) శివారులో గల హజరత్ మదార్ సాహెబ్ 3వ ఉర్సుకు నిర్వాహకులు సోమవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. దర్గా వద్దకు వచ్చే భక్తులకు నీటి వసతితో పాటు అన్నదానం ఏర్పాటు చేసేందుకు తగిన ప్రణాళిక తయారు చేశారు. ఈ నెల 25 నుంచి 27 వరకు దర్గాలో వైభవంగా ఉత్సవాలు జరిపేందుకు ఉత్సహంగా పని చేస్తున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎండీ అక్బర్, బాబార్, జాబేర్, షేక్.షకుర్, నూరు జంగయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం ఎగుమతి చేయాలి



వెంకటసాయి మిల్లులో రికార్డు పరిశీలిస్తున్నడీటీ రఘునందన్

చింతపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మిల్లర్లుందరూ నాణ్యమైన బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్ ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ తెలిపారు. చింతపల్లి మండల వెంకట సాయి రైస్ మిల్లును సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహి ంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుతో పాటు విక్రయాల విషయంలో పారదర్శకంగా ఉండి లేవీని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. బియ్యాన్ని ఫిలిప్పన్స్ బర్మా దేశాలకు ఎగుమతి చేయడంలో మిల్లర్లు చర్యలు తీసుకోవాల న్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడకుండా పారదర్శకంగా పనిచేసుకో వాల న్నారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడిగా సైదులు



నిడమనూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన కంచి సైదులు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన్ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తూనే టీఆర్‌టీ పరీక్ష రాసి స్కూల్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని, ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడిగా వీరన్ననాయక్



దామరచర్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడిగా మండలంలోని మంగళ్ దుబ్బ తండాకు చెందిన ధీరావత్ వీరన్ననాయక్ ఎన్నిక య్యారు. ఈనెల 19, 20 తేదీల్లో నల్లగొండలో నిర్వ హించిన ఎస్ఎఫ్ఐ 45వ జిల్లా మహాసభలో వీరన్ననాయక్‌ను జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తామన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ

దామరచర్ల, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి నాలుగైదు నెలల నుంచి వేతనాలు అందించడం లేదని వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనం తరం పంచాయతీ కార్మికుల మండల నూతన కమిటీని ఎన్ను కున్నారు. కార్యక్రమంలో మహమ్మద్ జైరుద్దీన్, ప్రేమమ్మ, జ్యోతి, మున్నేతు మారు, పాతులోతు రాము, మిడతపల్లి లలిత, మేడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

పెద్దఅడిశర్లపల్లి,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. దేవరకొండ డిపో చెందిన బస్సు సోమవారం రాత్రి 8 గంటకు హైదరాబాద్ నుంచి హాలియా రంగుండ్ల వైపునకు వెళ్తున్నది. ఈ క్రమంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గేర్, ఇంజన్‌లో సాంకేతిక లోపంతో మొరాయించింది. దీంతో గంటకు పైగా ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చింది. కొంత సమయం తరువాత డిపో అధికారులు మరో బస్సును పంపించడంతో దానిలో ఎక్కి ప్రయాణికులు వెళ్లిపోయారు. తరుచుగా బస్సులు మొరాయించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

ఉద్యమ నేతను ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలి : టీజేఎస్

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉద్యమ నేత పన్నాల గోపాల్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) జిల్లా ఉపాధ్యక్షులు లావూరి క్రాంతికుమార్ కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని పలు పాఠశాలలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధ్యాయలకు అండగా నిలుస్తారన్నారు. రాజకీయాలకతీతంగా అన్నివర్గాల ప్రజలకు సేవలందిస్తున్న గోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన నాగేశ్వరరావు, ప్రకాష్‌నాయుడు, సైదానాయక్ పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

డిండి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం బలపర్చిన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సోమవారం ఆపార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, తవక్లాపూర్, రామంతపూర్, చెర్కుపల్లి, గౌరారం, కామేపల్లి ఉన్నత పాఠశాలల్లో ఉన్న ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, ఏటి కృష్ణ, సైదా, ఉప్పునూతల ప్రసాద్ పాల్గొన్నారు.

వాణిజ్యపంటల సాగుకు మొగ్గు

» దేవరకొండ డివిజన్‌లో పెరుగుతున్న వేరుశనగ, మిరప, దొండ పంటల సాగు » గిట్టుబాటు ధర కల్పించాలంటున్న రైతులు

దేవరకొండ డివిజన్ పరిధిలోని రైతులు వాణిజ్య పంటలపై దృష్టిసారిస్తున్నారు. ఈ యాసంగిలో వేరు శనగ, మిరప, దొండ, మునగ పంటలు సాగు చేస్తోన్నారు. డివిజన్ పరిధి లో 2.12 లక్షల ఎకరాల వరకు వివిధ పంటలను రైతులు సాగు చేసుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)



కొండమల్లేపల్లి మండలంలో సాగుచేసిన మిరప పంట

ఈ ఏడాది డివిజన్ పరిధిలోని నేరేడుగొమ్ము, చందంపేట, దేవరకొండ, పీఏపల్లి, చింతపల్లి, కొండమల్లేపల్లి మండలాలకు చెందిన రైతులు 20వేల ఎకరాల్లో వేరుశనగ, 1500 ఎకరాల్లో మిరప పంటలు సాగు చేస్తున్నారు. గతేడాది 1.70 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేయగా 15వేల ఎకరాల్లో వేరుశనగ, 25వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగుచేశారు. కృష్ణాపరీవాహక ప్రాంతంలో నేరేడుగొమ్ము, చందంపేట, పీఏపల్లి, చింతపల్లిలో అత్యధికంగా వేరుశనగ పంటలు సాగుచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది 1,500 ఎకరాల్లో మిరప సాగు చేశారు. మిరప పంట కూడ బాగానే సాగైంది. కాని గిట్టుబాటుధర రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఏపల్లి, కొండమల్లేపల్లి, గుర్రంపోడు మండలాల్లో రైతులు దొండసాగుపై దృష్టి సారించారు. ఆరుతడి పంటలైన దొండ, ము నగ, కూరగాయల సాగుపై రైతులు మొగ్గు చూపు తున్నారు. కాని రైతులు దొండ పంట సాగు చేస్తున్నప్పటికి దళారీల చేతిలో మోసపోతునే ఉన్నారు.

ఎకరాకు రూ.2.5 లక్షల వరకు ఖర్చు చేసి దొండ పంట లను సాగుచేస్తున్నారు. ఉద్యానవనశాఖ అధికారులు ఎకరాకు రూ.60వేల సబ్సిడీ ఇస్తున్నారు. 60 రోజుల్లో దొండ పంట దిగుబడి వస్తుంది. దొండపంటను వ్యాపారులు నేరుగా రైతుల వద్దకే వచ్చి 50 కిలోల బస్తాకు రూ.400 నుంచి 500వరకు విక్ర యిస్తు న్నారు. పీఏపల్లి మండలం కొనపోకలవారి గూడెం వద్ద ప్రభుత్వం రూ. 60 లక్షలతో దొండ మార్కెట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ నిరుపయోగంగా ఉంది. అధికారులు పట్టించుకోక పోవ డంతో రైతులు తాము పండించిన దొండ పంటలను వ్యాపారులు చెప్పిన రేటుకే విక్రయిస్తున్నారు.

విధిలేని పరిస్థితిలో రైతులు వ్యాపారులకు తాము పండించిన పంటలకు నష్టం వచ్చినప్పటికి విక్రయించే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కలిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

5వేల ఎకరాల్లో పెరిగిన వేరుశనగ

దేవరకొండ డివిజన్‌లో గతేడాది 15వేల ఎకరాలు వేరుశనగ పంట సాగుచేయగా ఈ ఏడాది 20వేల ఎకరాలకుపైగా సాగుచేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. డివిజన్ పరిధిలోని రైతులు దొండ, వేరుశనగ, మిర్చి, మునగ, ఇతర కూరగాయల పంటలపై దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. బోరు బావులు, నీటి వనరులు ఉన్న రైతులు అధికంగా కూరగాయలు సాగుచేస్తున్నారు.

మూడు ఎకరాల్లో మిరప వేశా



మూడు ఎకరాల్లో మిరప పంట వేశాను. రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టాను. కానీ పంట చేతి కొచ్చే సమయానికి మార్కెట్‌లో ధర లేదు. క్వింటాల్‌కు రూ.12 నుంచి 14వేల వరకు ధర పలుకుతుంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి.

- బూడిద రమేష్, రైతు, కొండమల్లేపల్లి

గిట్టుబాటు ధర కల్పించాలి



వేరుశనగ, మిరప పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఈ ఏడాది ఐదు ఎకరాల వరకు వేరుశనగపంట సాగు చేశాను. అందుకుగాను అప్పులు చేసి 70వేల వరకు పెట్టుబడులు పెట్టాను. పంట ఇప్పుడిప్పుడే చేతికొస్తుంది.

-కొర్ర తులసీరాం, అచ్చంపేటపట్టి, చందంపట మండలం

రైతులకు సూచనలు అందిస్తున్నాం

దేవరకొండ డివిజన్‌లో ఈ ఏడాది వేరుశనగ, మిరప పంటలు రైతులు అధికంగా సాగు చేశారు. ఆరుతడి, వాణిజ్యపంటలు వేసుకొని అధిక దిగుబడులు పొందాలని రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సలహాలు, సూచనలు ఇస్తు న్నాం. రైతు సమావేశాలు ఏర్పాటు చేసి వివిధ పంటలపై అవగాహ న కల్పిస్తున్నాం.

-శ్రీలక్ష్మి, ఏడీఏ, దేవరకొండ

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

దేవరకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఈనెల 23న నల్లగొండలో నిర్వహించిన జపాన్ కరాటే అసోసియేషన్, ఎస్ఎస్ కరాటే అకాడమీ, షాడోఖాన్, రాష్ట్ర వారియర్ కప్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో దేవరకొండకు చెందిన మాస్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించారు. కరాటే పోటీల్లో ప్రథమస్థానంలో గోల్డ్‌మెడల్ సాధించిన విజేతలు సమంగి, వివాంక్, అనంత్, భవిష్, సాత్విక్, శ్రేష్ఠ, దేన్షాన్, దినేష్, జ్ఞానేశ్వర్, అంజి, చరణ్, రాజ్‌కుమార్, అనుష్కతోపాటు గెలుపొందిన విజేతలను అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, సర్వయ్య, హరికృష్ణ, మురళీకృష్ణ, ఇమ్రాన్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాడ్గులపల్లి: విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈవో వెంకటమ్మ

● మాడ్గులపల్లి . మండల కేంద్రం లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటారు. వారినిఎంఈవో వెంకటమ్మ సోమవారం అభినందించారు. కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థినులను ఉపాధ్యాయులు శ్రీలత, వినోద, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాములు, శోభారాణి, ఇస్మాయిల్, భాగ్యవతి అభినందించారు.

శివపార్వతుల కల్యాణోత్సవం రేపు

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి మండల కేంద్రం లోని సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 26న మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆల యంలో రాత్రి 9.55 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన, మంత్రపుష్పం, మంగళ హారతి విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



బొడ్రాయి వద పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మండలంలోని జాల్ తండాలో సోమవారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించుకోవడం మం చి విషయమన్నారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని కలిగి ఉండాలన్నారు. గ్రామా భివృద్ధికి తనవంతుగా తోడ్పాటునందిస్తానన్నారు. అనంతరం గ్రామస్థులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మునినాయక్, స్వామినాయక్, పంతు నాయక్, శ్రవణ్‌నాయక్, కుమార్‌నాయక్, నరేష్, ప్రకాశ్, భక్తులు పాల్గొన్నారు.

'రాజవరానికి పల్లె వెలుగు బస్సులు నడపాలి'

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 24(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రం నుంచి రాజవరం గ్రామం వరకు పల్లె వెలుగు బస్సులు నడ పాలని మాజీ సర్పంచ్ పోలెపల్లి సైదమ్మా ఆంజనేయులు, సీపీఎం మండల నాయ కుడు వేములకొండ పుల్లయ్య కోరారు. గ్రా మంలో సోమవారం వారు విలేకరులతో మా ట్లాడారు. మహా శివరాత్రి సందర్భంగా గ్రామంలో నిర్వహించనున్న మల్లప్ప జాతరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మల్లప్ప జాతరకు హైదరాబాద్, ఆంధ్ర ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారని, నల్లగొండ, మిర్యాలగూడ డిపోల నుంచి బస్సులు నడపాలన్నారు. సమావేశంలో బుర్రి సైదయ్య, షేక్ చాంద్ పాషా, చుక్క రంగయ్య, పిట్టల శంకరయ్య, మేకల సైదయ్య, దండ లింగయ్య, పార్వతమ్మ పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దేవరకొండ, కొండమల్లేపల్లి మార్కెట్ యార్డుల్లో కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి అధికారులను కోరారు. స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో సోమ వారం నిర్వహించిన ఆ పార్టీ మండలశాఖ సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కందులు పండించిన రైతులు విక్రయించడానికి సిద్ధంగా ఉన్నారని మార్కెట్‌లలో సీసీ కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని కోరారు. దీంతో పాటు ప్రభుత్వం సన్నవడ్లకు రూ.500 బోనస్ అందజేయాలన్నారు. మండలంలో రైతులు పండించిన మిరప, వేరుశనగ పంటలకు మద్దతు ధర కల్పిం చాలన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, ఆంజనేయులు, గోవర్ధన్ పాల్గొన్నారు.

● డిండి : రైతులు ఈ వానాకాలంలో పండించిన కందులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.షైనొద్దిన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కందులు కొనుగోలు కేంద్రాలులేక రైతులు పండించిన కందులను దళారీలకు రూ.6,200 విక్రయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,200 రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి



డిండి సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహరెడ్డి

డిండి, ఫిబ్రవరి 24(ఆంధ్ర జ్యోతి): త్వరలో జరుగబోయే స్థానిక సంస్థలకుఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాటాడారు. పార్టీ శ్రేణులు గ్రామాల్లో నూతన శాఖలు ఏర్పాటు చేయాలని ఎన్నికలకు కార్యకర్తలను సంసిద్ధంగా చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హమీలను అమలు చేయాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో వెంకటరమణ, బుచ్చిరెడ్డి, ఎస్ఆర్. కనక చారి, ఎండీ.షైనొద్దిన్, శైలాజ్, విజేందర్‌రెడ్డి, రవీందర్ శర్మ, కేశవులు, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

త్రిపురారం ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబుసాయిపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా మండల విద్యాధికారి రవినాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో కష్టపడి చదివి రాబోవు కాలంలో ఉన్నత స్థాయిలో ఉండాలని విద్యార్థులను కోరారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు కొప్పోజు శ్రీనివాస్, ఉపాధ్యాయులు కళ్యాణి, లత, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

హాలియా, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): హాలియాలోని కేజీబీవీ పాఠశాలలో బేటీ బచావో... బేటీ పడావో సోమవారం సీడీపీవో ఉదయశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలకు బాల్య వివాహాలు, బాలకార్మికులు, బాలిక విధంగా ప్రాముఖ్యత, సంక్రమిత వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అలాగే హైదరాబాద్ గుడ్ యూనివర్స్ ఎన్‌జీవో నీలోఫర్, టీం వారు పాఠశాలలోని 292 మంది కిశోర బాలికలకు హెల్త్ ఎడ్యుకేషన్, పర్సనల్ హైజిన్, పోషకారంపై అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలకు శానిటరీ యూస్‌బుల్ నాప్‌కిన్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, డీహెచ్‌ఈడబ్ల్యు రిటికా టీం, స్టాఫ్, అనుముల ప్రాజెక్టు సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

'జానపద కళాకారులకు అవకాశమివ్వాలి'

మిర్యాలగూడ టౌన్. ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హరి నామ సంకీర్తన చేసేందుకు జానపద కళాకారులకు అవకాశం కల్పించాలని అన్నమాచార్య కళాక్షేత్ర పీఠాధిపతులు శ్రీవిజయశంకరస్వామి కోరారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన హరి నామ సంకీర్తన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో అవకాశమివ్వాలన్న సంకల్పంతో భజన, కోలాట ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ సాంస్కృతిక కళా కేంద్ర సభ్యులు పులి కృష్ణమూర్తి, పుల్లాబట్ల లక్ష్మీనారాయణశర్మ, రాఘవాచార్యులు, శ్రీనివాస శర్మ, నరసింహమూర్తి, ఉపేందర్, వేణుగోపాలశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు మరోసారి రీ సర్వే

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం మండలంలో రీ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన ఎంపీవో భిక్షంరాజు, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌తో కలిసి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షించారు. మండల కేంద్రానికి చెందిన అనుముల బుచ్చిరాములు గుడిసెలో నివసిస్తుండడంతో అతడి ఇంటికి వెళ్లారు. వాస్తవానికి అర్హుడిగా ఎంపిక కావాల్సి ఉన్నప్పటికీ ఎల్-2 జాబితాలో తన పేరు చేర్చారని బాధితుడు వాపోవడంతో అర్హుల జాబితాలో చేర్చుతామని ఎంపీడీవో బాధితుడికి హామీ ఇచ్చారు అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే గ్రామపంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఎల్-1 లిస్టులో అనర్హుల పేర్లు ఉన్నట్లయితే ఈ సర్వే ద్వారా వారిని తొలగించడంతోపాటు వేరే జాబితాలో ఉన్న అర్హులైన వారిని తిరిగి ఎల్-1లో చేరుస్తామన్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే చేసే క్రమంలో అర్హులను గుర్తించడంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని పలు గ్రామాల్లో బాధితులు ఆరోపిస్తూ విమర్శలు చేస్తున్నారు.